

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | గురువారం 30-7-2020 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:26 | సంచిక: 309 | పేజీలు: 8 | వెల: రూ.1/-

## కరోనా మృతుల అంత్యక్రియల్లో నిస్వార్థ సేవ

### శ్రీనగర్ అంబులెన్స్ డ్రైవర్ జమిల్‌కు సర్వత్రా ప్రశంసలు

శ్రీనగర్,జూలై29(ఆర్ఎన్ఎ): కొవిడ్‌తో చనిపోయిన వారి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వారి కుటుంబ సభ్యులు కూడా ధైర్యం చేయడం లేదు. తమకెక్కడ కరోనా సోకుతుందో అనే భయంతో వారు దూరంగా ఉంటున్నారు. కానీ ఓ అంబులెన్స్ డ్రైవర్ మానవత్వంతో మెలుగుతున్నాడు. కుటుంబ సభ్యులు తీసుకెళ్లని కొవిడ్ రోగుల మృతదేహాల అంత్యక్రియల్లో ఈ డ్రైవర్ పాల్గొని సిబ్బందికి సహాయం చేస్తున్నాడు. జమిల్ అహ్మద్ అనే వ్యక్తి శ్రీనగర్‌లో అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతను ఇప్పటికే వేలాది మంది కరోనా రోగులను ఆస్పత్రికి తరలించాడు. అదే క్రమంలో కరోనాతో చనిపోయిన వారి మృత దేహాలను కూడా స్మశాన వాటికకు తరలించి.. అంత్యక్రియల్లో పాల్గొంటు న్నాడు. 85 మంది అంత్యక్రియల్లో పాల్గొన్నట్లు అహ్మద్ తెలిపాడు. అంబులెన్స్ సైరన్ మోగగానే గుంతలు తవ్వకుండానే కొందరు పారిపోతు న్నారు. అసంపూర్తిగా ఉన్న గుంతలను తానే తవ్వి.. అంత్యక్రియలను పూర్తి చేస్తున్నట్లు అహ్మద్ చెప్పాడు. కరోనా భయంతోనే అందరూ దూరంగా ఉంటున్నారని పేర్కొన్నాడు. తాను చేస్తున్న పనికి దేవుడు ప్రతిఫలం అందిస్తాడని జమిల్ తెలిపాడు. అల్లా దయతోనే తాను ఈ పనులన్నీ చేస్తున్నానని వివరించాడు. తన కుటుంబానికి ఎలాంటి కరోనా సోకలేదని పేర్కొన్నాడు. తనకు తానే బంధువులను, స్నేహితులను కలవడం మానేశానని అహ్మద్ చెప్పాడు.

## కుప్పకూలిన మూడంతస్తుల భవనం

బెంగళూరు,జూలై 29(ఆర్ఎన్ఎ): బెంగళూరు నగరంలో కపిల్ థియేటర్‌కు వెళ్లే దారిలో ఉన్న మూడంతస్తుల మేజెస్టిక్ హోటల్ ఒక్కసారిగా కూలిపోయింది. అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఎవరికీ ఎలాంటి గాయాలు కూడా కాలేదని అధికారులు తెలిపారు. ఈ భవనం పక్కనే కన్‌స్ట్రక్షన్ జరుగుతుండడంతో భారీ గొయ్యి తీశారు. దీంతోనే హోటల్ కూలిపోయిందని అధికారులు చెబుతున్నారు. కపిల్ థియేటర్‌ను కూల్చి మల్టిప్లెక్స్ కడుతుండగా దీని కోసం దాదాపు 80 అడుగుల లోతులో భారీ గొయ్యిని తవ్వారు. అయితే దాని పక్కనే ఉన్న బిల్డింగ్‌పై ప్రభావం పడింది. దీంతో పగుళ్లు వచ్చి భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. అప్రమత్తమైన అధికారులు పక్క భవనంలో ఉన్నవారిని కూడా ఖాళీ చేయించారు

## ఆర్టీసీ బస్సు ఢీకొని.. వ్యక్తి దుర్మరణం

వరంగల్ రూరల్, జూలై 29: ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందిన విషాద ఘటన జిల్లాలోని వర్ధన్నపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు జిల్లాలోని రాయపర్తి మండలం ఊకల్ గ్రామానికి చెందిన నరసింహుల రాజుగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేలా చర్యలు

### అండర్‌పాస్‌లు, బ్రిడ్జిల నిర్మాణాలకు ప్రాధాన్యం
### నగరంలో లక్ష బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం: కెటిఆర్

హైదరాబాద్,జూలై29(ఆర్ఎన్ఎ): నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అనేక బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. అలాగే పేదలకు లక్ష బెడ్‌రూములు నిర్మిస్తున్నామని అన్నారు.

అండర్ బ్రిడ్జ్‌తో ఫేతే నగర్ బ్రిడ్జ్‌పై రద్దీ తగ్గుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఆర్‌యూబీ నిర్మాణంతో ఫేతే నగర్ బ్రిడ్జ్ పై రద్దీ తగ్గుతుందన్నారు. బుధవారం కేటీఆర్ ఆర్‌యూబిని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ నగరంలో 137 కొత్త లింక్ రోడ్లు వేస్తున్నాం. దీని వలన 6.5 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఈ ప్రాజెక్టును ఏడాదిలో పూర్తి చేస్తాం. రేపు రెండు లింక్ రోడ్లు ప్రారంభిస్తాం. సెప్టెంబర్ వరకు బాలా నగర్ ప్లై ఓవర్ పూర్తి అవుతుందన్నారు. రోడ్డు విస్తరణలో ఎక్కవ మొక్కలు నాటాలని సూచించారు. త్వరలోనే నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు అందిస్తామని తెలిపారు. నగరంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు అభివృద్ధి పనులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అభినందించారు.

#### నారాయణ రెడ్డికి ఘన నివాళులు

తెలంగాణ వైతాళికులను స్మరించుకుంటూ పలు కార్యక్రమాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. పద్మభూషణ్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి. నారయణ రెడ్డి 89 వ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లో సి.నా.రె సారస్వత సదనం ఆడిటోరియమ్‌కు కేటీఆర్ శంకుస్థాపన చేశారు.

సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లో సారస్వత సదనం ఆడిటోరియం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రతిభ, పాండిత్యం, ప్రజ్ఞ.. అన్నీ కలగలిపిన వ్యక్తి సినారె అని కీర్తించారు. దక్షిణ భారత దేశం నుంచి రాజ్యసభకు వెళ్లిన మొదటి కవి సినారె అని గుర్తు చేశారు.

తెలంగాణ కవులు, కళాకారులకు ఇదొక కొత్త వేదిక అని, సాధ్యమైనంత త్వరగా సారస్వత సదనం నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సిరిసిల్లలో గ్రంథాలయానికి సినారె పేరు పెట్టుకున్నామని వివరించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... పాఠ్య పుస్తకాల్లో సినారె చరిత్ర ఉండేలా చొరవతీసుకుంటామన్నారు. ఇండోర్ ఆడిటోరియం నిర్మాణానికి ప్రభుత్వం రూ.10కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. కళలు, కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పాటు పలువురు నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



బాలానగర్ అండర్ పాస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్

# అమృతం లాంటి మాతృభాష రేపటి తరాలకు అందాలి

### ఆంగ్లం ద్వారానే అభివృద్ధి అన్న భావన పోవాలి
### అంతర్జాతీయ వెబినార్ ప్రారంభ సమావేశంలో వెంకయ్య

న్యూఢిల్లీ,జూలై29(ఆర్ఎన్ఎ): ఆంగ్లభాష ద్వారా మాత్రమే అభివృద్ధి అనడం సరికాదని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. 'జ్ఞాన సముపార్జన మాధ్యమం-మాతృభాష' అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ వెబినార్ ప్రారంభ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నాలుగు వేల ఏళ్ల చరిత్ర పరిశీలిస్తే ఇదంతా అర్థమవుతుందన్నారు. అమృతం లాంటి మాతృభాష రేపటి తరాలకు అందాలని ఆకాంక్షించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మాతృభాషకే అగ్రతాంబూలం. మాతృభాషలో పరిశోధన చేసిన వారికే నోబెల్ బహుమతులు వచ్చాయి. అనేకమంది విదేశీ నేతలు మాతృభాషలోనే మాట్లాడతారు. ఆంగ్లం వచ్చినా అనేకమంది అగ్రనేతలు వారి మాతృభాషే మాట్లాడతారు. జ్ఞాన సముపార్జనకు మాతృభాష ఎంతో దోహదం చేస్తుంది. సామాన్య ప్రజలకు అర్థమయ్యే భాషలోనే పరిపాలన జరగాలి. అన్ని రాష్ట్రాలు అధికార భాషను మరింత ప్రోత్సహించాలి. 90 శాతం దేశాలు మాతృభాషలోనే విద్యాబోధన చేస్తున్నాయి. మాతృభాష ద్వారానే పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. నేటి చిన్నారులు పెద్దబాలశిక్ష, వేమన, సుమతి శతకాలు చదవాలి. మాతృభాషను మరింత లోతుగా పరిశీలిస్తే ఎన్నో పదాలు తెలుస్తాయి. మాతృభాషను ఉపాధి రంగంతో అనుసంధానం చేయాలి. వివిధ రంగాల అవసరాలు తీర్చేలా మారిస్తేనే మాతృభాషలకు మనుగడ ఉంటుందన్నారు. సాంకేతిక నిపుణులు కూడా మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి. భారత్‌లో ఉన్నన్ని భాషలు మరో దేశంలో లేవు. కరోనా వేళ సురక్షిత దూరం, స్వీయనియంత్రణ పదాలు సృష్టించాం అని వెంకయ్యనాయుడు వివరించారు.



అంతర్‌ఆజతీయ వెబ్‌నార్‌లో మాట్లాడిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

# అంబాలా ఎయిర్‌బేస్‌కు చేరుకున్న రాఫెల్

### సుమారు ఏడువేల కిలోమీటర్ల ప్రయాణం
### రాఫెల్ రాకతో భారత అస్త్రశక్తి బలోపేతం
### రాఫెల్ చేరుకున్నట్లు రాజ్‌నాథ్ ట్వీట్

న్యూఢిల్లీ,జూలై29(ఆర్ఎన్ఎ): రాఫెల్ యుద్ధ విమానాలు భారత్ నేలను ముద్దడాయి. ఏడు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించిన రాఫెల్ విమానాలు.. బుధవారం అంబాలా ఎయిర్‌బేస్‌లో సురక్షితంగా ల్యాండ్ అయ్యాయి. ఆ విమానాల రాక భారత అస్త్రశక్తిని మరింత పెంచింది. భారత గగనతలంలో ప్రవేశిస్తున్న వేళ రాఫెల్ గర్జనలు మార్మోగాయి. ఫ్రాన్స్ నుంచి బయలుదేరిన అయిదు రాఫెళ్లు.. భారత గగనతలంలోకి మధ్యాహ్నం ప్రవేశించాయి. ఆ సమయంలో అద్భుతమైన ఘట్టం చోటుచేసుకున్నది. అయిదు రాఫెళ్లకు రెండు సుఖోయ్‌లు అండగా నిలుస్తూ స్వాగతం పలికాయి. ఆ దృశ్యం నీలాకాశంలో కనువిందు చేసింది. భారత గగనతలంలోకి ప్రవేశిస్తున్న రాఫెల్ యుద్ధ విమానాల ఫోటోలను రక్షణమంత్రి కార్యాలయం తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది. రాఫెల్ పక్షులు ఇండియన్ ఎయిర్‌స్పేస్‌లోకి ప్రవేశించినట్లు ట్వీట్‌లో తెలిపారు. ఫ్రాన్స్‌కు చెందిన దసాల్ట్ కంపెనీ తయారు చేసే ఈ యుద్ధ విమానాలను భారత్ కొనుగోలు చేసింది. మొత్తం 36 రాఫెళ్లకు ఒప్పందం కుదిరింది. అయితే తొలుత అయిదు రాఫెల్ విమానాలను అప్పగించారు. దీంట్లో 30 రాఫెల్ విమానాలు ఫైటర్ జెట్స్ కాగా, మరో ఆరు ట్రైనీ విమానాలు ఉండను న్నాయి. 60వేల కోట్లతో రాఫెల్ డీల్ కుదుర్చుకున్నారు. 400కోట్లతో రాఫెల్ విమానాల మౌళిక సదుపాయాల కోసం ఖర్చు చేశారు. 17వ గోల్డెన్ యారో స్క్వాడ్రన్‌లో ఈ విమానాలు ఉంటాయి. శౌర్యచక్ర విజేత కెప్టెన్ హరికీరత్ సింగ్ తొలి రాఫెల్‌ను ల్యాండ్ చేస్తారు. 2008లో మిగ్ విమానాన్ని అత్యంత చాకచక్యంగా ల్యాండ్ చేయడంలో కెప్టెన్ హరికీరత్ కీలక పాత్ర పోషించాడు. మిగ్‌లో పేలుడు జరిగినా.. కాక్‌పిట్ నుంచి చీకట్లోనే యుద్ధ విమానాన్ని ల్యాండ్ చేశాడతను. రాఫెల్ యుద్ధ విమానాలు మిస్సైళ్లను కూడా మోసుకెళ్తాయి. మెటిరో, స్కాల్ప్ లాంటి క్షిపణలను అవి ప్రయోగించగలవు. కంటికి కనిపించని దూరంలో ఉన్న టా÷-గ్గ్ం÷ట్‌ను అవి ఛేదించగలవు. మెటిరో మిస్సైళ్ల రేంజ్ 150 కిలోమీటర్లు ఉంటుంది. స్కాల్ప్ మిస్సైల్ 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న టా÷-గ్గ్ం÷ట్‌ను ధ్వంసం చేస్తుంది. రాఫెల్ యుద్ధ విమానాల్లో టూ సీటర్, సింగిల్ సీటర్లు ఉన్నాయి. టూ సీటర్‌ను రాఫెల్ డీహెచ్, సింగిల్ సీటర్‌ను రాఫెల్ ఈహెచ్ అని పిలుస్తారు. రెండూ ట్విన్ ఇంజిన్ విమానాలే. ఇవి ఫోర్త్ జనరేషన్స్ ÷ట్రైర్ విమానాలు. డెల్టా వింగ్, స్టీల్త్ సామర్థ్యం వీటికి ఉన్నది. అణ్వాయుధ దాడిలోనూ ఈ యుద్ధ విమానాలను వినియోగించే అవకాశం ఉన్నది. రాఫెల్ విమానాల్లో సార్ రేడార్లు ఉంటాయి. సింథటిక్ అపచ్యూర్ రేడార్ సాధారణంగా జామ్ కాదు. లాంగ్ రేంజ్ టా÷-గ్గ్ం÷ట్లను ఈ రేడార్ గుర్తిస్తుంది. రేడార్ జామ్ కాకుండే ఉండే సదుపాయాలు కూడా దీంట్లో ఉన్నాయి. రాఫెల్‌లో ఉన్న రేడార్... కనీసం 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రు టార్గెట్‌ను గుర్తించ గలదు. ఈ యుద్ధవిమానాల్లో ఆధునిక 30ఎంఎం కెనాన్ ఆయుధాలు ఉంటాయి. అవి 125 రౌండ్ల కాల్పులు జరపగలవు. ఈ విమానాలు ఒకేసారి పది టన్నుల సరకులను మోసుకెళ్లగలవు. రాఫెల్ విమానాలు హమ్మర్ అనే మీడియం రేంజ్ మిస్సైళ్లను కూడా ప్రయోగిస్తాయి. ఆకాశం నుంచి నేలపై ఉన్న టా÷-గ్గ్ం÷ట్‌ను స్ట్రయిక్ చేస్తాయి. లడఖ్ లాంటి పర్వత ప్రాంతాల్లో ఉన్న బలమైన కట్టడాలను, బంకర్లను కూడా హమ్మర్ మిస్సైల్ ధ్వంసం చేయగలదు. అంబాలా ఎయిర్‌బేస్‌లో విమానాలు ల్యాండ్ అయిన తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేశారు. రాఫెల్ విమానాలు ల్యాండైన క్షణం.. భారత సైనిక చరిత్రలో కొత్త శకం మొదలైనట్లు తెలిపారు. బహుళ సామర్థ్యాలు కలిగిన రాఫెల్ యుద్ధ విమానాలు భారత వాయుసేనను బలోపేతం చేస్తాయన్నారు. రాఫెల్ విమానాలు అంబాలాలో దిగిన వీడియోను రాజ్‌నాథ్ పోస్టు చేశారు.

# ఆర్‌యూబి నిర్మాణంతో తగ్గనున్న దూరం

### ఆరు కిలోమీటర్ల నుంచి 1.8 కిమి. తగ్గదల
### నిర్మాణ పనులకు తలసానితో కలసి కెటిఆర్ శంకుస్థాపన

హైదరాబాద్,జూలై29(ఆర్ఎన్ఎ): సనత్‌నగర్‌లోని ఇండస్ట్రియల్ ఏరియాలో రూ.68.30 కోట్లతో చేపట్టనున్న రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణ పనులకు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్, పశుసంవర్ధక శాక మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం రెండు లేన్‌లుగా ఉన్న ఫతేనగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిని సుమారు 400 మీటర్లు మేర రూ.45.04 కోట్లతో నాలుగు లేన్‌లుగా విస్తరించే నిర్మాణ పనులను కూడా మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఇందులో రూ.36 లక్షలను హెచ్ఆర్‌డీ అధికారులు రైల్వే అధికారులకు చెల్లించారు. అప్పటి ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా నిర్మించిన ఫతేనగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ప్రస్తుతం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో రెండు లేన్లుగా ఈ బ్రిడ్జిని విస్తరించడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించవచ్చన్న భావనలో ఉన్న ప్రభుత్వం ఈ పనులకు పూనుకుంది. ప్రస్తుతం సనత్‌నగర్ ప్రాంత ప్రజలు నర్సాపూర్ చౌరస్తా, జీడిమెట్లకు వెళ్లాలన్నా, జీడిమెట్ల నుంచి సనత్‌నగర్ వైపునకు రావాలన్నా ఫతేనగర్ బ్రిడ్జి మీదుగా సుమారు ఆరు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తున్నది. ఈ ఆర్‌యూబీ నిర్మాణంతో కేవలం 1.8 కిలో మీటర్లు ప్రయాణించి తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. దూరభారం తగ్గడమే కాకుండా ఫతేనగర్ ఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గనుంది. గడిచిన 30 ఏండ్లుగా ఈ సమస్యతో బాధపడుతున్న సనత్‌నగర్ ప్రాంత వాసులు ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టాలన్న విజ్ఞప్తి మేరకు స్పందించిన మంత్రి తలసాని మే 15న మేయర్ బొంతు రాంమోహన్, హెచ్ఆర్‌డీ, రైల్వే అధికారులతో కలిసి ఆర్‌యూబీ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఆర్‌యూబీ నిర్మాణ ప్రాధాన్యాన్ని మంత్రి తలసాని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తో చర్చించి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ఈ ఆర్‌యూబీ నిర్మాణ పనులకు సంబంధించి ఇప్పటికే హెచ్ఆర్‌డీ అధికారులు రైల్వే అధికారులకు రూ.89.70 లక్షలు చెల్లించారు.

# తెలంగాణలో కరోనా వైరస్ విజృంభణ

### పాజిటివ్ కేసులసంఖ్య 58,908కి చేరిక

హైదరాబాద్,జూలై29(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతోంది. పాజిటివ్ కేసుల సంఖ్య రోజు రోజుకి పెరుగుతోంది. రాష్ట్రంలో కొత్తగా 1,764 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం బాధితుల సంఖ్య 58,908కి చేరింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం బుధవారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. గత 24 గంటల్లో 18,858 శాంపిల్స్‌ను పరీక్షించినట్టు ఆరోగ్యశాఖ తెలిపింది. కరోనాతో మంగళవారం ఒక్క రోజే 12 మంది మృతి చెందారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు కరోనా బారిన పడి మృతి చెందిన వారి సంఖ్య 492కి చేరింది. కొత్తగా వచ్చిన కేసుల్లో జీహెచ్ఎంసీ పరిధిలో 509 ఉన్నాయి. మేడ్చల్‌లో 158,నల్లగొండ51, నిజామాబాద్47, మహబూబ్‌నగర్47, పెద్దపల్లి44, వరంగల్ రూరల్ 41, సూర్యాపేట 38, రంగారెడ్డి147, వరంగల్ అర్బన్ 138, కరీంనగర్ 93, సంగారెడ్డి 89, ఖమ్మం జిల్లాలో 69 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు 43,751 మంది కరోనా నుంచి కోలుకోగా, ప్రస్తుతం 14,663 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇదిలావుంటే కరోనా మహమ్మారి మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాను కూడా పూర్తిగా వణికిస్తోంది. ఇప్పటికే దాదాపు 1600 పాజిటీవ్ కేసులతో జిల్లా అతలాకుతలమవుతోంది. ఈ నేపథ్యంలో స్వచ్ఛంధంగా లాక్ డౌన్ అనే మాట వినిపిస్తోంది. అత్యవసరమైనప్పుడు మాత్రమే బయటకు రావాలని, సామాజిక దూరం పాటించాలని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా జనాలు పట్టించుకోవడంలేదు. షాపుల వద్ద గుమిగూడుతున్నారు. విచ్చలవిఢిగా రోడ్లపై తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వ్యాపారులు సమావేశమై స్వచ్ఛంధ లాక్ డౌన్‌కు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే జడ్చర్లలో ఆగస్టు 2 వరకు లాక్ డౌన్ ప్రకటించారు. అలాగే నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం నుంచి ఆగస్టు 8 వరకు లాక్ డౌన్ ప్రకటించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్నిరకాల వ్యాపార సముదాయాలు నిర్వహించి తర్వాత స్వచ్ఛంధంగా మూసివేయాలని వ్యాపార సంస్థల అసోసియేషన్ నిర్ణయించింది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా విజృంభిస్తున్న కరోనా వైరస్ ఎవరినీ వదలడం లేదు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు కోవిడ్ బారినపడి కోలుకోగా తాజాగా మరో ఎమ్మెల్యేకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి బుధవారం కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దాంతో ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో ఐసోలేషన్‌కు వెళ్లారు. కాగా,నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణెళిష్ గుప్తా కరోనాబారినపడి కోలుకున్న సంగతి తెలిసిందే. ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ ఇటీవల కోవిడ్‌బారినపడి చికిత్స పొందుతున్నారు.

# దేవాలయ భూములను పరిరక్షిస్తాం : మంత్రులు



హైదరాబాద్, జులై 29: దేవాదాయ భూముల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఆలయ భూముల ఆక్రమణదారు లను ఉపేక్షించేది లేదని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. జంటనగరాల పరిధిలోని దేవాదాయ భూముల రక్షణకు చేపట్టాల్సిన చర్యలపైన మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి , తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం దేవాదాయ శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.దేవాదాయ భూముల పరిరక్షణ, నిరుపయోగంగా ఉన్న ఆలయ భూములను గుర్తించి, వాటి ద్వారా ఆదాయం పొందే మార్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ..దేవాదాయ శాఖకు సంబంధించిన ఆస్తుల లీజుల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. నామమాత్రపు ధరకు దేవాదాయ శాఖకు సంబంధించిన షాపులను లీజుకు తీసుకొని.. తిరిగి వాటిని అధిక అద్దెకు సబ్ లీజుకు ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కాగా, లీజ్ నిబంధనలు మార్చి దేవాదాయ శాఖకు మరింత ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. దశాబ్దాల క్రితం నాటి లీజ్ లతోఆ పాటు అద్దెల విషయంలో కూడా పునఃసమీక్ష చేసుకోవాలని చెప్పారు. ఆలయ భూముల ద్వారా వచ్చే ఆదాయం, పెంచే మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. హైదరాబాద్ పరిధిలో రూ. 55 కోట్ల వ్యయంతో 13 ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న దేవాదాయ భూముల్లో షాపింగ్ కాంప్లెక్స్ లు, కళ్యాణ మండపాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఈ సందర్భంగా మంత్రులకు వివరించారు.రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ ద్వారా 1300 ఎకరాల ఆలయ భూములను గుర్తించి వెనక్కి తీసుకున్నామని, 21 వేల ఎకరాల ఆలయ భూములకు రక్షణ సరిహద్దు బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. దీర్ఘ కాలంగా కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న ఉన్న భూముల పరిష్కరించేందుకు కోర్టుల్లో బలమైన వాదనలు వినిపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ, విజిలెన్స్ జాయింట్ సెక్రటరీ శేఖర్, అదనపు కమిషనర్ శ్రీనివాస రావు, రీజినల్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్‌లో మరో ఇద్దరు మంత్రులకు కరోనా

### -ఇప్పటికే హోం క్వారంటైన్‌లో సిఎం చౌహాన్

భోపాల్,జూలై29(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్‌లో మరో ఇద్దరు మంత్రులకు కరోనా పాజిటివ్ వచ్చింది. ఇప్పటికే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కరోనా పాజిటివ్ రావడంతో హోమ్ క్వారెంటైన్‌లో ఉన్నారు. తాజాగా ఆయన క్యాబినెట్‌లోని మరో ఇద్దరు మంత్రులకు కూడా కరోనా పాజిటివ్ వచ్చింది. జలవనరుల శాఖ మంత్రి తులసీరామ్ సిలావత్, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి రామ్‌ఖేలావన్ పటేల్ కరోనా మహమ్మారి బారినపడ్డారు. జలవనరుల శాఖ మంత్రి తులసీరామ్ సిలావత్ తనకు కరోనా పాజిటివ్ వచ్చిన విషయాన్ని మంగళవారం రాత్రి ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. పంచాయతీ, గ్రామీణాభి వృద్ధి శాఖ మంత్రి రామ్‌ఖేలావన్ పటేల్‌కు కరోనా సోకిన విషయాన్ని భోపాల్ జిల్లా అధికారులు బుధవారం వెల్లడించారు. వారితోపాటు మధ్యప్రదేశ్ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుహాస్ భగత్ సహా పలువురికి కరోనా పాజిటివ్ వచ్చిందని అధికారులు తెలిపారు.

# జీతాల కోసం ఉస్మానియా నర్సుల ఆందోళన

### మూడోరోజూ కొనసాగిన నిరసనలు

హైదరాబాద్,జూలై29(ఆర్ఎన్ఎ): జీతాలు ఇవ్వడం లేదంటూ ఉస్మానియా ఆసుపత్రిలో నర్సులు చేపట్టిన దర్నా మూడో రోజుకు చేరుకుంది. నాలుగు నెలలుగా జీతం ఇవ్వడం లేదంటూ 87 మంది స్టాఫ్ నర్సులు విధులు బహిష్కరించారు. దీంతో గత మూడు రోజులుగా 12 ముఖ్య విభాగాల్లో సేవలు కుంటుపడ్డాయి. అవుట్‌సోర్సింగ్ కింద నాలుగు నెలల క్రితమే ఉద్యోగంలో చేరినా ఇప్పటివరకు దీనికి అపాయింట్మెంట్ లెటర్ ఇవ్వడం లేదని ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. తక్షణమే అవుట్‌సోర్సింగ్ లెటర్‌తో పాటు, ఐడీ కార్డు, రెండు నెలల జీతం ఇస్తేనే విదులకు హాజరవుతామని డిమాండ్ చేస్తున్నారు. నర్సుల ఆందోళనలతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపీ, ఎమ్జ్గం÷న్సీ, ఐసోలేషన్ వార్డులు, పోస్టు ఆపరేటివ్ వార్డుల్లో రోగులు తీద్ర ఇబ్బందులు పడుతున్నారు.

# బక్రీద్ ప్రార్థనలు ఇంటికే పరిమితం కావాలి

### వ్యర్థాల తొలగింపుపై అధికారులతో మంత్రి సమీక్ష

హైదరాబాద్,జూలై29(ఆర్ఎన్ఎ): రానున్న బక్రీద్‌పండుగ ప్రత్యేక పరిస్థితుల మధ్య జరగనుందని హోంమంత్రి మహమూద్‌అలీ తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తిచెందుతున్న దృష్ట్యా ముస్లిం సోదరులు ప్రత్యేక శ్రద్ధ వహించి పండగ జరుపుకోవాలని సూచించారు.

ప్రార్ధనలు ఇంట్లోనే చేయాలని, అక్కడ కూడా భౌతికదూరం పాటించాలని, మాస్క్‌లను ధరించాల అన్నారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న బక్రీద్ పండగను పరస్కరించుకుని మంత్రి మహమూద్‌అలీ జీహెచ్ఎంసి అధికారులతో సమావేశమయ్యారు.

పండగ సందర్భంగా బలి ఇచ్చే జంతువుల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు జీహెచ్ఎంసి అధికారులు ఏర్పాట్లుచేశారని తెలిపారు.

ఇందుకోసం ప్రత్యేక వాహనాలను అదనపు సిబ్బందిని నియమించామని జీహెచ్ఎంసి అధికారులు హోంమంత్రికి వివరించారు.

వర్షాలు అధికంగా కురుస్తున్న ప్రస్తుత తరుణంలో వ్యర్థాలను తొలగించే ప్రక్రియలో జీహెచ్ఎంసి సిబ్బందికి ముస్లిం సోదరులు సహకరించాలని అధికారులు అన్నారు. ఈసమావేశంలో కమిషనర్ లోకేశ్‌కుమార్, జోనల్ అధికారులైన రవికిరణ్, మమత, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నమ్మలేని నిజాలు**

దక్షిణాయణం
పూజల పుణ్యకాలం
కరోన కాలం

వెండితెరలు
ఇనుప తెరలయ్యాయ్
కాలం మహిమ

కంటి తుడుపు
చేస్తాం తర్వాత చూస్తాం
ఓటు ఓటమి

చావుకి పది
మందుకోసం వందలు
నీతికి చెద

కొత్త చిగురు
కొత్త సచివాలయం
దుఃఖం లో నిజాం



– రేడియమ్
సెల్: 9291527757


నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com  website: www.netinijam.com

గురువారం 30-7-2020  ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433  హైదరాబాద్ 3


**శ్రీనిజాలు**

అబద్ధాలు నిజనిజాలు
జోడెద్దుల కుమ్ములాట !
ఒకరి మీద ఒకరు నింద
ఎత్తిపోస్తు దుమ్ముపాట !

కోతలొద్దు చేయండోయ్
కరోనాను కట్టడి !
కలిసి కట్టి పోరుతేనె
మహమ్మారి ముట్టడి !



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



# తిరునగరి 'అంతరాత్మ...'

ఐదున్నర దశాబ్దాలకు పైగా సాహిత్య సేవలో రేడియో, దూరదర్శన్‌కు వందల భక్తి గీతాలు అనేక ప్రసంగాల ద్వారా గొప్ప వ్యక్తిగా ఖ్యాతి గడించిన ప్రముఖ సాహితీవేత్త

**తిరునగరి రామానుజయ్యను**

రాష్ట్రానికి తలమానికమైన మహాకవి దాశరథి కృష్ణమాచార్య-2020 సాహితీ పురస్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన సందర్భంగా...

**26-9-2018న**

తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహించిన "పరిణతవాణి" కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన డా॥ తిరునగరి ప్రసంగ పాఠం.

జీవితయాత్రలో డెబ్బైమూడేళ్ళు గడిచిన తరువాత నా సాహిత్య జీవితాన్ని గూర్చి వెనక్కి తిరిగి చూచుకునే అవకాశం నాకు లభించింది. తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు, ప్రస్తుత సభకు అధ్యక్షులైన ప్రఖ్యాత సాహితీవేత్త, కవితా సర్వజ్ఞులు గౌరవనీయులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు నాకు ఈ అవకాశాన్ని కల్పించారు. పరిణతవాణి ప్రసంగం చేయమన్నారు. ఇంతకన్నా భాగ్యమేమున్నది. ఇతరుల గురించి ప్రసంగించేటప్పుడు సాధికారికంగా చెప్పవచ్చు. కాని తన గూర్చి చెప్పుకునేటప్పుడు చిక్కువస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఒళ్ళు దగ్గరపెట్టుకొని జాగ్రత్తగా, బాధ్యతగా మాట్లాడవలసి ఉంటుంది. ఆత్మస్తుతి, అతిశయోక్తి లేకుండా ప్రసంగం సాగాలి. ఆ స్పృహలోనే నా ప్రసంగ వ్యాసాన్ని కొనసాగిస్తాను.

నేను తెలంగాణ రాష్ట్రంలోని అప్పటి నల్లగొండ జిల్లాలోని ఇప్పటి యాదాద్రి-భువనగిరి జిల్లాలోని రాజాపేట మండలం బేగంపేట గ్రామంలో 18 జూన్ 1945 పార్థివ జేష్ఠ శుద్ధ అష్టమినాడు జన్మించాను. మాది చాత్తాదశ్రీ వైష్ణవ సంప్రదాయం. మా నాన్నగారు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు. సంస్కృతాంధ్రాలలో చక్కని ప్రతిభకలవాడు.

మా అమ్మగారు సంప్రదాయ కీర్తనలు, తిరుప్పావై పాఠాలు, భక్తిగీతాలు పాడుతూనే గృహిణిగా వంటావార్పు, ఇంటిపనులు చేస్తుండేవారు. అమ్మ చుట్టూ తిరుగుతూ నాశైశవంలో బాల్యంలో ఆమె ఆలపించే పాటలన్నింటిని వినేవాణ్ణి. ఆమె పాడినవన్నీ ఈనాటికీ నా మేథస్సులో పదిలంగా ఉన్నాయి. నా తొలిగురువు మానాన్నగారే. వారివద్దనే సుమతి శతకం నుండి అమరం దాకా నేర్చుకున్నాను. పంచకావ్యాలూ వారివద్దనే అభ్యసించాను. మా నాన్నగారి వద్ద నేర్చుకున్న పోతన భాగవతంలోనే 'గజేంద్రమోక్షం', 'ప్రహ్లాదచరిత్ర', 'వామన చరిత్ర', రుక్మిణీ కల్యాణం పద్యాలు, నాకు బాల్యంలోనే కంఠస్తాలు. 1950 నుండి 1954 దాకా నాన్నగారి ఖాన్గీ బడిలోనే నా చదువు సాగింది. ప్రధానంగా తెలుగు సాహిత్యానికి సంబంధించిన శతకాలు, భాగవతం, సంస్కృతంలో బాల రామాయణం మొదలు పంచకావ్యాల పఠనం దాకా. ఐతే మా నాన్నగారు ప్రభుత్వ పాఠశాల చదువుకు నన్ను దూరం చేస్తున్నానేమోనని, దానివల్ల నా భవిష్యత్తు ప్రశ్నార్థకమౌతుందని తలచి, తాను పనిచేస్తున్న వేంకటాపురం గ్రామం సమీపంలో గల తుర్కపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో నేరుగా నాల్గవ తరగతిలో చేర్పించారు. అలా ప్రారంభమైంది నా పాఠశాల విద్యాభ్యాసం. భువనగిరి ఉన్నత పాఠశాలలో చదివి హెచ్.ఎస్.సి. ఉత్తీర్ణుడనయ్యాను. తరువాత హైదరాబాదులో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఆ సమయంలోనే ఓరియంటల్ డిప్లొమా పరీక్షను చదివి ఉత్తీర్ణుడనయ్యాను.

1965 జూన్‌లో ఇప్పటి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని దేవర యాంజాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగ పండితుడిగా ఉద్యోగంలో చేరాను. ఉపాధ్యాయ వృత్తిలోనే తెలుగు బి.ఓ.ఎల్, ఎం.ఏ పూర్తి చేశాను. 36 సంవత్సరాలు పండితునిగా, జూనియర్ లెక్చరర్‌గా పనిచేసి 1999లో పదవీ విరమణ చేశాను.

నేను భువనగిరి పాఠశాలలో విద్యార్థిగా ఉండగానే నా తెలుగు ఉపాధ్యాయులు శ్రీ తోట రామదాసరావుగారు నా పద్యరచనను ప్రోత్సహించారు. నా సంస్కృత ఉపాధ్యాయులు శ్రీమాన్ అప్పలాచార్యులు, శ్రీమాన్ వేంకటాచార్యులు నా పద్యాలను విని ఆశీర్వదించారు. కవితారచనలో నాకు తొలిగురువు స్వర్గీయ తోట రామదాసరావుగారే. నా పదిహేనవయేట 'తాళవృక్షం' శీర్షికతో వ్రాసిన ఐదు పద్యాలు వరంగల్ నుండి కక్కెర్ల కాశీనాథం సంపాదకత్వంలో వెలువడిన గౌడ పత్రికలో ప్రచురించబడినై. ఇదే నా తొలి కవిత.

నేను ఉపాధ్యాయునిగా దేవరయాంజాలలో పనిచేసిన 1965–1967 కాలంలో నాటికి అప్పటి ప్రముఖ పత్రికలు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, ప్రజామత, చుక్కాని మొదలైన పత్రికలలో నా పద్యాలు, గేయాలు ప్రచురింపబడుతున్నాయి. ఆ దశలో 1966లో హైదరాబాదు కాచిగూడలో నివాసముంటున్న మహాకవి శ్రీ దాశరథిగారిని కలుసుకున్నాను. అప్పుడు దాశరథిగారు, హైదరాబాదు ఆకాశవాణిలో పనిచేస్తుండేవారు. వారికి నా రచనలు చూపించి ఆశీస్సులు అందించండని నమస్కరిస్తూ అభ్యర్థించాను.

బాబూ! నీ పద్యాలు బాగున్నాయి. రాస్తూ ఉండు. ప్రాచీన కవులతోపాటు ఆధునికులనూ చదువు. మళ్ళీ కలుద్దాం అని నా భుజం తట్టి ఆశీర్వదించారు.

దాశరథిగారితో ఆ పరిచయం ఇంతింతై వటుడింతై విడదీయరాని గురుశిష్య బంధమై, అంతకన్నా సోదరానుబంధమై వారు తుదిశ్వాస విడిచేదాకా కొనసాగింది. వారి ప్రభావం నాపైన ఎంతో ఉంది.

1962 ప్రాంతంలో నేను ఒక సంవత్సరం పాటు ఇంటిపట్టునే ఉన్నాను. ఆ కాలంలో మా నాన్నగారు మహాకవి గుర్రం జాషువాగారి 'గబ్బిలము' మొదలైన ఖండకావ్యాలు తాను టీచరుగా పనిచేస్తున్న వీరారెడ్డిపల్లి గ్రంథాలయం నుండి తెచ్చి ఇచ్చారు. అదే సమయంలో అప్పుడు మద్రాసునుండి వెలువడుతున్న ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో నేను 'యాదగిరిగుట్ట'ను గూర్చి రాసిన వ్యాసం ప్రచురింపబడింది. నాకు 50/-లు. ప్రతిఫలం కూడా ఎం.ఓ. వచ్చింది. మా నాన్నగారు ఆ వ్యాసం చదివి అంతకుముందు నుండి నేను రాసిన పద్యాలు చదివి ఆనందపడి నన్ను ఆశీర్వదించారు. ఇదీ నీ మార్గం. సాగిపో అన్నారు. ఆ నేపథ్యంలో నన్ను ప్రోత్సహించడానికి తమ పాఠశాల గ్రంథాలయంలోంచి సాహిత్య గ్రంథాలు తెచ్చి ఇచ్చి చదువుకోమనేవారు. ఆ వరుసలో జాషువా కావ్యాలు, ఖండకావ్యాలు, నేను చదివి ఆ మహాకవి భావజాలానికి, పద్యశిల్పానికి వందే అన్నాను. గుంటూరులోని శ్రీ గోపాలకృష్ణయ్య తోటలో నివసించే జాషువాగారికి లేఖ రాశాను. అది పద్యలేఖ.

**'తొల్లి ఏకలవ్యుడు భక్తి ద్రోణుమానము**
**నందు నొజ్జగాభావించి పొందె విద్య**
**నేడు నీమూర్తి నాయందు నిలిపి కవిత**
**సాధనము చేయుచున్నాడ సత్కవీంద్ర!** అంటూ ఆ ఐదు పద్యాల గురించి లేఖ రాశాను. పదిరోజుల తరువాత ఆ మహాకవి చదివి ఆశీస్సులు అందించారు. నీ పద్యాలు చదవాను,. పద్యరచన కొనసాగించు అంటూ దీవించారు. నాటుగోలె జాషువాగారి కావ్యాలు మళ్ళీ మళ్ళీ చదివాను. ఇంతో అంతో ధారణ ఉన్నందున జాషువాగారి చాలా పద్యాలు నా మేధస్సులో నిలిచినై. ఇప్పటికీ చాలా సభలలో జాషువాగారి పద్యాలలో సందర్భోచితంగా కోట్ చేస్తుంటాను.

నేను తరువాత కాలంలో హైదరాబాద్ దేవరయాంజాల ఉన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా ఉద్యోగిస్తున్నాను. అప్పుడు ముఖ్యమంత్రి స్వర్గీయకాసు బ్రహ్మానందరెడ్డిగారు మహాకవి జాషువాగారిని శాసనమండలి సభ్యునిగా నియమించాడు. జాషువాగారు హైదరాబాద్‌లో ఎమ్.ఎల్.సిగా ఉన్న కాలంలో నేను వారిని కలుసుకునే వాడని. అంతకుముందు నుండే వారికి లేఖలు రాసేవాణ్ణి. కాబట్టి నాపైన వాత్సల్యం చూపించేవారు. ఆ విధంగా ఏకలవ్య శిష్యుణ్ణి. నిజమైన శిష్యుణ్ణి అయ్యాను. జాషువా శాసన మండలి సభ్యునిగా ఉన్న కాలంలోనే 'నాగార్జున సాగరం' కావ్యాన్ని రచించారు. అది రచిస్తున్న కాలంలో ఓ సాయంత్రం వారిని కలుసుకోవడానికి ఇంటికి వెళ్ళగా వాలుకుర్చీలో ఒరిగి పొగచుట్ట కాలుస్తున్నారు. నేను పాదాభి వందనం చేసి కూర్చోగానే ఎదురుగా టెబుల్‌పై ఉన్న నోటుబుక్ చూపించి రాయమన్నారు.

**'అంగడి యూరలేదు వరియన్నము లేదు'** అన్న పద్యం చెప్పారు. నాగార్జున సాగరం కావ్యాన్ని ఇప్పుడు చదువుతున్నప్పుడు ఆ పద్యం రాగానే ఆగిపోయి ఆనాటి మధుర స్మృతులను నేను గుర్తు చేసుకుంటాను. ధన్యోస్మి అనుకుంటాను. ఇలా మహాకవులిద్దరూ జాషువాగారు, దాశరథిగార్ల సాన్నిహిత్యం నాకు లభించడం వలన నాపైన వారిరువురి కవితా వ్యక్తిత్వాల ప్రభావం దండిగా పడిందని చెప్పడానికే పై సన్నివేశాలను ఉటంకించాను.

1965–75 దశాబ్ద కాలంలో నేను ప్రాచీన, ఆధునిక కవులను చాలా మందిని చదివాను. కవిత్రయాన్ని, పాల్కురికిని, శ్రీనాథుని, పోతనను, పెద్దనను, రాయలు, నంది తిమ్మన, పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడు, కంకంటి పాపరాజు, నంది చేమకూరి వేంకటకవి, రఘునాథ భూపాలుడు, వేమన, తాళ్ళపాక తిమ్మక్క ప్రాచీన కవులను, కవయిత్రులను రాయప్రోలు, అబ్బూరి, దువ్వూరి, విశ్వనాథ, కొడాలి ఆంజనేయులు, పుట్టపర్తి వంటి ఆధునిక కవులు గురజాడ, బసవరాజు, నండూరి, కవికొండల, శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, బైరాగి, ఆరుద్ర, అనిసెట్టి, తిలక్, కుందుర్తి వంటి అభ్యుదయ కవులను చదివాను.

ఇదంతా చెప్పడమెందుకంటే ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను ఏకాగ్రతతో చదవడం వల్ల సాహితీలోకంలో నాదైన ముద్రను, శైలిని నిర్మించుకున్నానని మనవి చేయడానికే. 1978 నుండి నా కవితలు తెలుగులో అగ్రశేణి పత్రికలైన 'భారతి' 'స్రవంతి', 'సాహితి', 'ఆంధ్రపత్రిక', 'ఆంధ్రప్రభ', 'కృష్ణాపత్రిక', 'విశాలాంధ్ర', మొదలైన వాటిలో ప్రచురింపబడ్డాయి. 'భారతి' సాహిత్య పత్రిక రెండున్నర దశాబ్దాల పాటు అది ఆగిపో యేదాకా నా కవితలను ప్రచురించింది. సాహితీ జగత్తులో నాకు ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చింది.

నా కవితలు గ్రంథరూపంలో రాకముందే సాహితీలోకంలో ప్రముఖ కవిగా నిలబెట్టినవి పత్రికలే. ఆయా పత్రికాధిపతులకు సదా నా కృతజ్ఞతలు.

నేను అన్ని కవితా ప్రక్రియలలో రచనలు చేశాను. పద్యం, గేయం, వచన కవిత మూడు ప్రక్రియలలో ఐదు దశాబ్దాల పాటు నా కవిత్వ రచన సాగింది.

ఇక్కడ ఓ విషయం ప్రస్తావించాలి. నా బాల్యంలో గ్రామీణ వ్యవస్థలో ఉన్నటువంటి సామాజిక పరిస్థితులు ముఖ్యంగా అగ్రవర్ణాల ధనవంతుల అధీనంలో నలిగిపోతున్న పేదవారి దయనీయ జీవితాలు నన్ను కదిలించాయి.

ఆ దశలో గుర్రం జాషువా రచనలు ప్రధానంగా 'గబ్బిలము' నాపై చాలా ప్రభావం చూపింది. ఆ దిశగా నేను కలం పట్టాను. ముఖ్యంగా పేదవారి జీవితాలే వస్తువుగా తీసుకొని పద్యాలు, గేయాలు రచించాను.

అభ్యుదయ కవితోద్యమములో పాల్గొన్నాను. అరసంలో 1970–80 మధ్య కార్యవర్గ సభ్యునిగా ఉన్నాను. సమసమాజ నిర్మాణం కోసం రచనలు చేయాలన్న వాదంతో ఏకీభవించాను. సమాజ శ్రేయస్సు కోరుకునే విధంగా రచనలు చేయాలన్న దృక్పథం బలపడింది. "విశ్వశ్రేయః కావ్యమ్" అన్న లక్ష్యంతోనే నేను కవిత్వం రచించాను. రచిస్తూనే ఉన్నాను. వస్తు వైవిధ్యంతో భావనవ్యతతో కవిత్వం రాస్తూ వస్తున్నాను. సరళ సుందరంగా సామాన్యునికి సైతం సుబోధకంగా ఉండే భాషలోనే నేను కవితా రచన చేస్తున్నాను.

**'అంధకారముతోడ పోరాడువాని**
**కంజలింతును ఏ కాలమందు నేను**
**మంచి పెంచగ నడుము బిగించినట్టి**
**వానికెప్పు డొనర్తును వందనాలు.**
(నా 'నీరాజనం' నుండి)

**'మాడుటెండలలోన మాడుచు**
**పొలములో**
**కష్టించి పనిచేయు కాపుబిడ్డ**
**ఎండను లెక్కింపకుండ బండలు**
**చీల్చి**
**కండలు కరిగించు కార్మికుండు**
**వంచిన నడుము రవ్వంతయు నెత్తక**
**నాట్లు వేసెడి కూలినాలి పడుచు**
**తట్టమోయుచు చిన్నితనయుని**
**గూరిచి**
**బంగారు కలగను పల్లెతల్లి**
**నేను పూజించువారు నాలోన**
**వెలుగు**
**వారు నా పల్లెదీపాలు, వసుధపైన**
**చల్లఐన మనసున్న పల్లెవారు**
**వారికెప్పుడు నేను కైవారమిడుదు**
(నా'నీరాజనం' నుండి)

పై రెండు పద్యాల ద్వారా నా కవితా లక్ష్యాలను సహృదయులు గ్రహించగలరం. మనిషి నా కవితా వస్తువు. మనిషి నా కవిత్వానికి కేంద్ర బిందువు, మానవత్వమే నా మతం. హ్యూమనిజం నా ఇజం. నా రచనా వ్యాసంగమంతా ఈ మానవతా పథం లోనే సాగింది.

నేను పద్యకావ్యాలు రచించాను. గేయఖండికలు రాశాను. వచన కవితా సంపుటాలను ప్రచురిం చాను.

బాలవీర, శృంగార నాయికలు, తిరునగరీయం నాలుగు సంపుటాలు. నీరాజనం, జీవధార పద్య కవితా సంపుటాలు.

'కొవ్వొత్తి', 'వసంతం కోసం', 'అక్షరధార', 'గుండెలోంచి', 'ముక్తకాలు మా పల్లె, మనిషి కోసం, 'వానా-వాదూ' 'ఈ భూమి', 'ప్రవాహిని', 'ఉషోగీత, 'ఒకింత మానవత కోసం', 'యాత్ర', 'కొత్తలోకం వైపు', 'కిటికీలోంచి', 'సముద్రమథనం', వచన కవితా సంపుటాలు. ఇప్పటికీ నేను ఇరవై ఐదు గ్రంథాలు ప్రచురించాను.

ఉస్మానియా విశ్వ విద్యాలయంలో నా సాహి త్యం పైన పరిశోధనలు చేసి ఇరువురు పి.హెచ్.ఇ. పట్టా తీసుకున్నారు.

1) తిరునగరి సాహిత్యం-సమగ్రపరిశీలన (డా. కె. వెంకటేశ్)

2) తిరునగరి కవిత మానవతా దృక్పథం, (డా॥వి. సత్యనారాయణ).

'నా గుండెలోంచి' వచన కవితా సంపుటిపైన పరిశోధన చేసి యం. ధర్మారావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నుండి ఎంఫిల్ పట్టా తీసుకున్నాడు.

నా కవిత్వాన్ని వివేచించిన, విశ్లేషించిన, పరి శోధించిన వారికి నా అభివాదాలు. ఈ యాభై ఐదేళ్ళసాహితీ యాత్రలో సతత కవవింతా హృదయ హరితాన్ని పోషించుకుంటూ ముందుకు సాగుతున్నాను. దాశరథిగారి మాటల్లో కంటికి కనిపించిందంతా కవిత్వంగా రాసేస్తున్నాను.

""తిరు'లో సంప్రదాయాన్ని నగరిలో నాగరికతను దాచుకొన్న ఉత్తమ కవి తిరునగరి అని ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు", "తిరు నగరి కవితలు తేజస్వంతములు, ఓజస్వంతములు, They are thought provoding full of Novelty " అని మహాకవి డా॥ దాశరథిగారు "పద్యం, గేయం వచనం వంటి కవితా ప్రక్రియలలో తిరునగరి అందెవేసిన చేయి. ఆయన తిరునగరీ యం సమాజాన్ని విశ్లేషిస్తూ వచ్చిన ఎక్సరే లాంటి పద్యకావ్యం" అని మహాకవి ఆచార్య డా॥ సి. నారాయణరెడ్డిగారు.

**"తిరునగరి కదిలిస్తే కవిత్వంతో మాట్లాడు తాడు. కలువరిస్తే కవిత్వమే పలుకుతాడు. కవిత్వమే ఆయన జీవన సర్వస్వం. ఆయన కూడగట్టుకున్న దంతా కవిత్వమే"** అన్నారు ఆచార్య పేర్వారం జగన్నాథంగారు.

**"హృద్యకవితా రచనలో సహృదయులను అలరిం పజేసే మధుర కవి తిరునగరి"** అని ఉత్పలవారు. **''తిరునగరి దార్శనిక భావజాలం పుష్కలంగా కలిగిన కవి ఆయన సంప్రదాయ సాహిత్య సంస్కారం, సంస్కృత భాషా పరిజ్ఞానం, ఆధునిక సాహిత్యావగాహన ఉన్న సాహితీవేత్త"** అని ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు నన్ను, నా కవిత్వాన్నీ ఆశీర్వదించారు.

వినయంతో వినమ్రంగా వారి ఆశీస్సులను స్వీకరించి విశ్వనాథవారి మాటలో కవితా రూపత పస్సు చేస్తున్నాను. కవితా పథంలో నిత్య చైతన్యంతో ముందుకు సాగుతున్నాను.

**నాగలి పట్టే వాడెప్పుడూ**
**నాకు కథానాయకుడు**
**పాఠం చెప్పేవాడెప్పుడూ**
**నాకు పరమ గురువు**
**కళ్ళముందున్న అమ్మ ఎప్పుడూ**
**కనిపించే దేవత**
**నీడనిచ్చే చెట్టు ఎప్పుడూ**
**స్నేహించే మిత్రుడు'**- అన్న కవితా పంక్తులు నా కవితా లక్షణాన్ని ప్రస్ఫుటం చేస్తాయి. కేచిత్ కవీనాం నవాదృష్టిః.

**నడచిన బాటలో**
**నడవడం నాకిష్టం లేదు**
**రాసిన పద్యాలే**
**రాయటం నాకు సరిపడదు.**
**నవత్వం నాకిష్టం**
**నవతవైపు సాగడం నాకిష్టం**
**మానవతా పతాకాన్ని చేబూని**
**ఆ నవతా పథంలో గమిస్తాను**
**నా చూపులో నవత్వం**
**నా ఊహలో నవత్వం**

(మిగతా 4వ పేజీలో...)

**తిరుగులేని తిరునగరి**

పద్యమందు గద్యమందు
అందెవేసినట్టి ఘనుడు
ధారణ శక్తికి యాతడు
తిరుగు లేని తిరునగరి.
మహావక్త మహాకవి
ఉపాధ్యాయ మహారథి
ఆడంబరములు లేని
తిరుగులేని తిరునగరి.
తేటనైన తెలుగు తనం
భారతీయ సద్భావం
అణువణువున నింపుకొన్న
తిరుగులేని తిరునగరి.
గురువులకు శిష్యులకు
పండితులకు పామరులకు
తనముద్రలు వేసినట్టి
తిరుగులేని తిరునగరి.
నిగర్వము నిండుతనము
సంస్కారం సాంగత్యం
తనదారిగ చూపినట్టి
తిరుగులేని తిరునగరి.
లాలిత్యము దేశభక్తి
ప్రజలకు కలిగించుటకై
ప్రభాతగీతాల కర్త
తిరుగులేని తిరునగరి.
నడిచె మహాగ్రంథమునకు
ప్రతిరూపము తిరునగరి
సంస్కారమునందించిన
తిరుగులేని తిరునగరి.
మహాభరతమ్ము మరియు
రామాయణ భాగవతం
ఆపోసన పట్టినట్టి
తిరుగులేని తిరునగరి.
మహాకవి దాశరథికి
సోదరుడై మసలుకొంటు
మనసునందు నిలిచినట్టి
తిరుగులేని తిరునగరి.
తెలంగాణ ప్రభుత్వము
దాశరథి అవార్డుతో
సత్కరించ పూనినట్టి
తిరుగులేని తిరునగరి

(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము డా. తిరునగరికి ప్రతిష్ఠాత్మకమైన "దాశరథి అవార్డు" ను ప్రకటించిన సందర్భంగా)



-బండిరాజుల శంకర్
9948050608





ఆగష్టు 29, 2015న మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రసంగిస్తున్న డా॥తిరునగరి.



జూన్ 26, 2014న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా ప్రసంగిస్తున్న డా॥ తిరునగరి.



ఆగష్టు 23, 2014న న్యూఢిల్లీలో 'తెలుగు భాషా వైభవం- కవితా నీరాజనం' సభలో ప్రసంగిస్తున్న డా॥ తిరునగరి



జులై 17, 2012న రవీంద్రభారతిలో సినీ నటుడు రంగనాథ్ 'నడక' పుస్తకావిష్కరణలో డా॥ తిరునగరి.



ఏప్రిల్ 12, 2015న బోనాలు సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో ప్రసంగిస్తున్న డా॥ తిరునగరి.



డిసెంబర్ 4, 2016న డా॥ తిరునగరి రచన "సముద్ర మథనం" పుస్తకావిష్కరణ సభలో..

(3వ పేజీ తరువాయి...)



డిసెంబర్ 13,2015న డా॥ కేతవరపు రాజ్యశ్రీ 'వంద ప్రశ్నలు-వేల భావాలు" పుస్తకావిష్కరణలో...



ఏప్రిల్ 10, 2014న దేగల అనితాసూరి 'స్వరధారి' కవితాసంపుటి ఆవిష్కరణ సభలో...



డిసెంబర్ 4, 2015న దొరవేటి రచన "అంజలి-2" గ్రంథావిష్కరణ సభలో...

నా శ్వాసలో నవత్వం
నా శబ్దంలో నవత్వం

అన్న కవితా పంక్తులు నా కవిత్వంలోని నవతాకాంక్షను ఎత్తి చూపుతాయి.

ఎదగాలి మనిషి
ఏపుగా నిండుగా
బతకాలి మనిషి
ఫలించే చెట్టుగా
వెలగాలి మనిషి
వెలుగిచ్చే దివ్వెగా
వర్థిల్లాలి మనిషి
పరోపకార హృదిగా
సాగాలి మనిషి.
చైతన్యఝురిగా-అన్నది నా ఆకాంక్ష.

'ఆత్మీయం' కవితలో నా కవితా లక్ష్యాన్ని తెలిపాను.

'మహాత్ముల అడుగుజాడల్లో
నడుస్తున్నవాణ్ణి
మానవత్వాన్ని గుండెగుండెలో
వెలిగిస్తున్నవాణ్ణి
చీకటితో పోరాడుతున్నవాణ్ణి
ఆకలి జీవుల పక్షాన నిలిచినవాణ్ణి
గతాన్ని ఆకళించుకొని
వర్తమానంలో సాగిపోతున్నవాణ్ణి
వర్తమానంలో జీవిస్తూ
భవిష్యత్తులోకి వీక్షిస్తున్నవాణ్ణి
బాధల్ని బరువుల్ని
ధైర్యంగా భరిస్తున్నవాణ్ణి
కర్తవ్యాన్ని విస్మరించకుండా
కదలిపోతున్నవాణ్ణి
మనిషిగా నా ధర్మాన్ని నిర్వహిస్తూనే ఉంటాను
మనీషతో
నా సమస్యల్ని పరిష్కరించుకుంటూనే ఉంటాను
సామాజిక జీవిగా
జనం కన్నీళ్ళు తుడుస్తూనే ఉంటాను
ఆకలి జీవుల పక్షాన నిలిచి
చీకటితో పోరాడుతూనే ఉంటాను.

'మానవుడే అన్నింటికీ మూలం' అన్నాడు గ్రీకు తత్త్వవేత్త ప్రొటోగరస్. మనిషే నా కవితా వస్తువుగా, మనిషి జీవించే ప్రపంచమే నా కవితా ప్రపంచంగా, నా కవితా సృజన సాగుతున్నది. నా కవితా సంపుటాలలో కొన్నింటి పేర్లు-

1 మనిషి కోసం
2 ఒకింత మానవత కోసం
3 మనిషి నా పద్యం

ఈ ఏభయ్యేళ్ళల్లో మూడువందలకు పైగా సాహిత్య వ్యాసాలు రాశాను. ప్రాచీన, ఆధునిక కావ్యాల గూర్చి కవిత్వంలోని విశిష్టతను గూర్చి వివేచి ంచాను. సుప్రసిద్ధ సాహిత్య పత్రికలన్నిటిలో నా సాహిత్య వ్యాసాలు, గ్రంథ సమీక్షలు ప్రచురింపబడ్డాయి. ప్రచురింప బడుతున్నాయి. పత్రికలకు ఇరవై సంవత్సరాల నుండి కాలమ్స్ రాస్తున్నా ను. ఆంధ్రప్రభ- 'చిన్నారి'లో 'పద్య సౌరభం' శీర్షికతో మూడేళ్ళపాటు ప్రాచీనాధునిక కవుల పద్యాలను ధారావాహికంగా పరిచయం చేశాను. 'జనధర్మ'లో 'ఆలోచన' శీర్షికతో ఐదేళ్ళ దాకా వివిధ సాహిత్య, సామాజిక అంశా లపై వ్యాసాలు రాశాను. పద్మశాలి పత్రికలో ఐదేళ్ళదాకా 'లోకాభిరా మాయణం' శీర్షికతో వ్యాసాలు రాశాను. చాత్తాద శ్రీవైష్ణవవార్త మాసపత్రికకు పదిహేనేళ్ళ నుండి నేటిదాకా 'లోకాలోక నం' శీర్షికతో ప్రతినెలా వ్యాసాలు రాస్తూనే ఉన్నాను.

ఇప్పటికి మూడువందలకుపైగా కావ్యాలకు, శతకాలకు, కవితా సంకలనాలకు పీఠికలు, అభిప్రాయాలు రాశాను. ఆకాశవాణి, దూరదర్శన్‌కోసం లలితగీతాలు, దేశభక్తి గీతాలు రాశాను. కార్గిల్ యుద్ధం సందర్భంగా నేను రచించిన

**మనమంతా ఒక్కటిరా**
**జనమంతా ఒక్కటిరా**
**భరతసీమ ఒక్కటిరా**
**భరతజాతి ఒక్కటిరా**

జాతీయస్థాయిలో ఉత్తమ దేశభక్తి గీతంగా ఎన్నిక చేయబడింది.

నా దినచర్యలో లేఖారచన ఒక అంశం. నలభయేళ్ళ నుండి నేటిదాక క్రమం తప్పకుండా సాహితీమిత్రులకు సాహిత్య లేఖలు రాస్తూనే ఉన్నాను. నా లేఖలలో నేను చదివిన సాహిత్య విశేషాలను నా కవి మిత్రులకు ఆ లేఖలలో వివరిస్తుంటాను.

ప్రసిద్ధ కవులు నాకు రాసిన లేఖల వల్ల నేను ఎంతో లబ్ధి పొందాను. ఎంతో నేర్చుకున్నాను. నేర్చుకుంటున్నాను.

వాఙ్మయం అనంతమైంది. నేర్చు కోవాల్సింది ఎంతో ఉంది. నా జీవిత మంతా గ్రంథపఠనంతోనే గడిచిపో తున్నది.

**గ్రంథామమాగ్రతస్వంతు**
**గ్రంథమే సంతు పృష్టతః**
**గ్రంథమే సర్వతస్సంతు**
**గ్రంథ స్సేవ వసామహమ్'** అని సదా కోరుకుంటాను. చాలాకాలం కింద ఒ విద్వన్మణి సభలో మాట్లాడుతూ **"తిరునగరికి ఓ పుస్తకం చేతికిస్తే గూట్లో పెట్టడు. నోట్లో పెట్టుకుంటాడు"** అన్నారు. ఆ ప్రశంసను వినయంగా స్వీకరించాను. నాకు వచ్చిన ప్రతి పుస్తకాన్నీ అమూలాగ్రం చదవేట్టు చేసింది ఆ మాట. నేను నిరంతర పాఠకుడను.

నేను రాసే ప్రతి వాక్యం కదలించేదిగా ఉ ండాలని భావిస్తాను.

'వాక్యం రసాత్మకం కావ్యమ్,
రమణీయార్థ ప్రతిపాదక శబ్ద: కావ్యమ్, అన్న ఆలంకారికుల వాణిని మనసులో పెట్టుకుంటాను.

'Great Literature is simply language changed with meaning to the utmost possible degree' అన్న Ezrapound మాటలను ఎప్పటికీ గుర్తుం చుకుంటాను. అందుకే నా కవిత్వంలో సారళ్యానికి పెద్దపీట వేశాను. అందం గా, మధురస నిష్యందంగా పఠితృలోక సంస్పందంగా కవిత్వం ఐదు దశాబ్దాల నుండి రచిస్తున్నాను.

కవిగా నా యాత్ర కొనసాగిస్తున్నాను

కవులు ప్రవహిస్తారు ప్రజల్లోకి అన్న మహాకవి శేషేంద్ర మార్గమే నాది

**మతముకన్న గొప్ప మానవత్వమురా**
**కనని వేల్పుకన్న మనిషి గొప్ప**
**మానవాళిసేవ మాధవ సేవరా**
**తిరునగరిది మాట తిరుగులేదు.**



ఆగష్టు 23, 2014న ఢిల్లీలో జరిగిన 'తెలుగు భాషా వైభవం కవితా నీరాజనం' సభలో...



డిసెంబర్ 24, 2015న శ్రీమతి నందిమళ్ల మాధవీ శ్రీనివాస్ పుస్తకావిష్కరణలో...



డిసెంబర్ 19, 2014, పట్టాల అశోక్ రచన 'అశోకం' గ్రంథావిష్కరణ సభలో...

## పునరుజ్జీవన

పెద్ద తేడా ఏం లేదు
తలుపులూ కిటికీలూ మూసినా తెరిచినా
కాస్త నిస్తేజంగా పలకరించే గాలీ వెలుతురూ
వద్దన్నా పలకరింపుకు తరలివచ్చే
దొరల్లాటి దోమలూ, చుట్టూ చుట్టూ రొదపెట్టే
తుమ్మెద బారులూ ...
పెద్ద తేడా ఏం లేదు
లోపల ఉన్నా తలుపుకు ఏ వైపున ఉన్నా.

ఒకప్పుడు ఉదయాలు గులాబీ తోటల మధ్య
పూల సజ్జలయేవి
కాలవలు తీసిన మొక్కల మధ్య
ప్రవహించే నీరయేవి.
ప్రతి మొగ్గా సిగ్గుపొత్తిళ్ళలో తొంగొతొంగి చూసే
నవయవ్వనమయేది.
పగళ్ళు కాళ్ళరిగేలా తిరిగే యంత్రాలయేవి
సాయంత్రాలు అప్పుడప్పుడే విచ్చుకుంటున్న
సన్నజాజి తీగల పరిమళాలయేవి.
అప్పుడప్పుడే దాగుడు మూతలాడే వెలుగు చీకట్లయేవి.

ఇప్పుడు మాత్రం
తెర ఎదురుగా పాతేసిన మూగరాటలైపోయాయి.
బుల్లి తెరో చిన్న తెరో
ఏదో ఒక తెర
భయంగా ఉంది
కాళ్ళు అవశేషకాలు అవుతాయేమో
కలల లోనూ అంతే
విమానాలూ , జెట్ వేగపు కార్లే తప్ప
నడకలు కనపడవు.

భయం ఒకటి నరనరాన సరసరాపాకి
కాళ్ళులేని జనం కళ్ళముందు పేజీలై
తిరిగాక
చటుక్కున తోట ఒకటి ఇంటి ముందుకో
బాల్కనీలోకో తేవాలని
ఇగిరిపోతున్న సజీవత మళ్ళీ
అణువణువునా నింపుకోవాలన్న ఆశ.
పసిబిడ్డల ను దత్తత తీసుకున్నట్టే
ఇప్పుడూ ప్రతిమొక్కా
ఉదయమే
చేతులు చాచి బోసినవ్వులతో పిలుస్తుంది.



-స్వాతీ శ్రీపాద
8297248988

## విజేతలెవరంటే... వారే

నగరజీవన వీధుల్లో
భయంతో కదలలేని కాళ్ళను
పదిలంగా ఇంట్లోనే పడేసి
చూపులను మాత్రం
చుట్టూరా ప్రసరింపచేస్తున్నాను
అగుపించకూడదనుకున్న దృశ్యం
ఎదురుగానే ప్రత్యక్షమైంది
ఎదలో అదురుపుట్టింది
అవతలనుండి వస్తున్న ఒకరూపం
తడబాటు అడుగులు వేసుకుంటూ
అంబులెన్సులో బలవంతంగా కాలిడింది
నగరమంతా ఆవరించిన కరోనా
ఎదురింటికీ వచ్చిందని
తలుపులూ... కిటికీలు మూసేసుకొని
సూర్యరశ్మికీ తావివ్వలేదు
ఆగని రోజులు దొర్లిపోతున్నా
మూగిన సమస్యలు ముదురుతున్నాయి
అంతలోనే
వెనకింట్లో వచ్చిన మూడుకేసులసంచలనం
ఇటూ తలుపులు బిడాయించుకునే
తరుణం ఆసన్నమైనదనే హెచ్చరికను
సహృదయంతో అందించింది
లోకానికి నాలుగు దిక్కులున్నా
రెండేమార్గాలున్న ఇల్లు మాది
రెండు కొండల నడుమనున్న
అగాధంలో తిష్టవేసామనిపించింది
బెదురు బతుకుల జీవనయానం
చెదిరిన మనోకల్లోలంలో
ఎన్నాళ్ళు ముందుకెళుతుందని
కూడగట్టుకున్న ధైర్యంతో
భీతిల్లిన హృదయసంకెళ్ళను తెంచేసాను
అప్రమత్తత, స్వీయరక్షణలనే
ఆయుధాలను మరింత గట్టిగా పట్టుకొని
స్వేచ్ఛావాకిట్లోకి దారితీశాను
ఈ రోజు దూరంగా పారిపోతే
రేపు అంతా ఒంటరిని చేస్తారనే సత్యం
మదిలోకి చొచ్చుకుపోయింది
లక్షణాలు కనబడ్డా లక్ష్యపెట్టని వారెందరో
పాజిటివ్ వచ్చినా మనస్సును
పాజిటివ్‌గా వుంచుకునేవారు మరెందరో
కరోనా కదనరంగంలో
ధైర్యంగా పోరాడి నిలిచిన యోధులు
విజేతలెవరంటే..... వారే
ఆ కథనాలన్నీ కనువిప్పు కలిగించాయి

(మా ఇంటికెదురింట్లో,
వెనుకింట్లో వచ్చిన
కరోనా కేసులకు స్పందిస్తూ)



-పొత్తూరి సుబ్బారావు
సెల్:9490751681

## బంధవిచ్ఛిత్తి

తే. గీ. ఆర్థికములైన బంధమ్ములంతరించె
దూర దేశ బాంధవ్యముల్ నీరు గారె
ఏమొ?తనివి తీరదొ?కరోనామయమ్ము
రక్త బంధమ్ములను కాలరాయ దొడగె

తే. గీ. గత్తరలు మీదపడి పచ్చి నెత్తురులను
జుర్రుకొనిపోయెనట మనుష్యులను జంపి
ప్రాణములె గాక సకల సంబంధములను
లేపుకొనిపోవు వైచిత్రి లేదు నాడు

సీ. గారవమ్మున తండ్రి గారిని పెనవేయు
బిడ్డలు మొకము చూపించలేక
దూరమ్ములోనున్న పేరిమి తనయుండు
చివరి చూపులకు విచ్చేయలేక
కలిమిలేముల చేయిగల్పి జీవించిన
దగ్గరి వారె చెంతలకు రాక
చెంత నిల్చిన కూర్మి చెలికాండ్రు కడు ప్రయ
త్నము సేసినను పెయ్యి తాకనీక

తే.గీ. చూడవలసిన వారిని చూడనీక
చూడదగు వారలే వచ్చి చూడలేక
శవములేద్చు చున్నవి-నికృష్టంపు చావు
లహితులకు గూడ రాకూడదనుచు మిగుల

మ. అతి గారాబముతోడ-పాదముల హస్తాంభోజముల్ పేర్చి సం
తు తలిర్పన్ నడిపించి పెంచుకొను బంధుత్వమ్ము శోకింప చి
మ్మితి హాహాలమునో కరోన!హృదయమ్మేలేని నీకేల బం
ధుతలో కమ్మదనమ్ము బోధపడు-నేతుల్మెచ్చునే గాడిదల్?

క. సతతము సంతోషముతో
బతికిన పచ్చని కుటుంబ బంధములెల్లన్
చితికి ప్రయాణము గట్టగ
కుతి దీరినదే కరోన?ఘోర వికరమా!

సీ. ప్రాణమిచ్చిన తల్లి బంగారుటొడి జేరి
వలపోయు వైనమ్ము తొలగ జేసి
తనువునిచ్చిన కన్నతండ్రి పాదాబ్జముల్
తలకెత్తుకొను కోర్కు నిలువరించి
గుండెలోపలి ప్రేమ గుమ్మరింతుమటన్న
కాయువు లోపల దాయవెట్టి
చివరి రూపమ్ము సుస్థిరముగా హృదిలోన
ముద్రించుకొను భాగ్యమును త్యజించి

తే.గీ. పేగు బంధమ్ముపై కత్తి వేటు వేసి
తోలుకొనిపోవు కరకు మృత్యువును జూచి
ప్రాణములు గల పీనుగుల పగిది బంద
బారి పోవుటే గాని ఆపంగ గలమె?



-తోకల రాజేశం
19676761415

## కాలాతీతుడు...

నది
చుక్కనీరు ఇవ్వకున్నా
పూజలున్నవి ఘనంగా పుష్కరాలున్నవి
కవి
పద్యం రాసినా మాట్లాడినా
నిర్భందాలు జైళ్లు ఉన్నాయి

ఆవు
పాలివ్వకున్నా గడెం మల్కపెట్టినా
పూల దండలున్నవి దండాలున్నవి
కవి
ఆలోచించినా ఆచరించినా
కుట్రకేసులున్నవి హత్యయత్నాలున్నవి

సమాజానికీ
బానిసైతే చాలు
ఊరేగిస్తది సన్మానిస్తది
ప్రజాస్వామ్య వాదై గొంతెత్తుతే
గుండెలు జారి కేసులు తొవ్వుతది
మానసికంగా మట్టుబెడుతది

సూర్యునికి నిందలు
కవికి జైళ్లు కొత్తకాదు
కిరణాలు ప్రసరిస్తయి
అక్షరాలు ప్రవహిస్తయి

అతను
అక్షరాల సముద్రం
హక్కుల తోవ
న్యాయం అడిగే నేల గొంతు
ప్రజాస్వామ్య పోరు పతాకం

జైళ్లు
స్వేచ్ఛా కెరటాలు కావు
రాజ్యం పూసిన చెట్టుకొమ్మలే...

అతడొస్తాడు
రాతిబండపై రావిచిగురులా
ముళ్లకంపలోంచి మోదుగుపూవులా
నల్లరేగడిలోంచి నేరెడులా
భూమిని చీల్చుకొని మొక్కలా... అరుద్రలా...
తూర్పున వేగుచుక్కై .....

సూర్యుడు యువకుడే...
కవి యువకుడే....
అతడు కాలాతీతుడు



-వనపట్ల సుబ్బయ్య
9492765358

## కణిక

**సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు**

నిర్వహణ: *డా॥ప్రతికంఠం మాలతీలత*
అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**
ఈ సమూహంలో చేరదలచినవారు
8985613123కి మెసేజ్ చేయవచ్చు.

**శీర్షిక :దాశరథి కవితకు సమీక్ష**

### ప్రథమ విజేత

**ఈ రాజకీయ హాలా హల సంతర్పణ**
**ఎంత కాలమిలా ప్రజా హంతకులకు ఆనందం**
**కూడు లేని కోట్ల జనులు గోడుగోడు మంటుంటే**
**కోట్లకొద్దీ ఆయుధాల కొరకు ఖర్చు చేసి.....**

అంటూ తిమిరంతో సమరంలో కవి ప్రస్తుత రాజకీయాల్లో రేకెత్తుతున్న కంపును తలచుకుని బాధ పడతారు. రాజకీయాలు యువతను తప్పదారి పట్టిస్తుందని రాజకీయాల పట్ల ఆకర్షితులై మంచి చెడులను తెలుసుకోలేక యువత పెడదారిలో పడుతుందని తెలియచేస్తూ హింస నుండి సమమాజ హంస ఉద్భవించుననే అసత్యాన్ని నమ్మ వద్దని యువతకు ఉద్బోధించారు. విప్లవం హింస వల్ల కానీ , అధికారం వల్ల కానీ రాదనీ తెలియచేస్తూ, పైస కింత విలువనిచ్చే పాడు విధానం పోయి,మనిషికింత విలువనిచ్చే మంచిరోజు రావలంటారు.అభాగ్యులు అన్నమో రామచంద్రా అంటూ అల్లాడుతుంటే రాజకీయ హంతకులకు ఇవి ఏమి పట్టడం లేదని వాపోయారు. మామూలు పరిస్థితులలోని జయం జయం కాదంటూ తిమిరంతో ఘన సమరం చేసిన బ్రతుకే అమరం కవితా తేజో వలయం అవని శాంతికది నిలయమని తెలియచేసారు దాశరథి



**-పులి జమున**,8500169682

### ద్వితీయ విజేత

**రైతుదే తెలంగాణము రైతుదే**
**ముసలి నక్కకు రాచరికంబుదక్కునే**
**దగాకోరు, బాటాచోరు రజాకారు**
**పోషకుడవు,**
**దిగిపొమ్మని జగతనీతా నగారాలు**
**కొడుతున్నది,**
**ఆగిపోవోయ్, తెగిపోవోయ్** అంటూ తన కవితతో...

నిజానీ నిరంకుశ పాలనలో ప్రజల స్థితిగతులను, వారిజీవన విధానంపై పెత్తనీదార్లు చేసే ఆధిపత్యనీ భరించలేని ఆయన కలం గళం కలగలసి ఎన్నో కవితా అస్త్రాలని సంధిస్తూ ప్రజా చైతన్యనీ చేస్తూ రైతులు పడే కష్టాలను వెట్టిచాకిరిని తొలగించడానికి ఎర్రసూర్యుడై ఎగసి ఉద్యమబాటలో చైతన్య ఊపిరిలూదిన మహామేధావి. నైజం ప్రభువుల అజమాయిషి, ఆదిపత్యంలో కొనసాగే పాలనలో రైతు కన్నీళ్లకు తన కవితతో ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని రాచరికపు పట్టం ఇక దక్కించుకోలేరని, ముందున్నది తెలంగాణ తేజమని ఎలిగెత్తి చాటాడు. దగాకోరుతనాన్ని, బడాచోరుతనాన్ని రజాకర్లాను అడ్డదారిలో పోషించే ఓ నైజానీ రాచరికమా !ఇక నీ ఆటలు సాగవు జాగ్రత్త ! నీకు నీవుగా నీ రాచరికాన్ని వదిలి వెళ్ళిపో అని లేదంటే మా జగత్తనీతా నీపై నగారామోగిస్తోనీది దిగిపోయి తెగిపోవోయి అని నిజాంను బహిరంగనీగా గద్దినీచి ప్రజల్లో కొండంత ధైర్యాన్ని నింపినాడు.



**-చిందం సునీత**
9701075502

## విశ్వ జీవన రాగం

సూక్ష్మంలో మోక్షం ని జయించే
శాస్త్రోక్త సంస్కరణల విత్తులు చల్లి
సరళ సూత్రాలు ఎన్నో ప్రబంధాలు గా మలిచి
యావత్ ప్రపంచానికి జ్ఞానాన్ని వడ్డించి
విశ్వ జీవనరాగాలు పలికించే
అద్వైత సిద్ధాంతాలకు నాంది మన వ్యవస్థ

ఈ ఉమ్మడి కుటుంబాల లోగిళ్లలో
ఎన్నెన్ని స్మృతుల ధారలో
మనం అనే ఐక్యత రాగాన్ని
హృదయ గదులలో పొంగిస్తూ!

తమలపాకుతో నువ్వు ఒకటంటే
తలుపు చెక్కతో నే రెండంటా
అనే అవగాహన లేమితనంహృదయంలో
అక్రమంగా చొరబడి
కలహాల తుఫానులు చెలరేగి
శోకకావ్యాలు అలుముకుని
ఆలుమగల బతుకు పడవ
కన్నీటి సుడిగుండాల లో మునకేయపోతుంటే
వారించి గట్టెక్కించే అనుభవాల తెడ్లు ఉన్న
కుటుంబాలు మనవేకదా....!!

మనం అనే కలుపుకునే గుణసంపదకు
తర్పణాలు వదిలిన యువ జంటలు
ఆరంకెల కార్పొరేట్ కాసుల జడివానలో
ఆపాదమస్తకం తడుస్తూ........
నా గుణింతం నాలుకపై నట్టువాంగం పలికిస్తూ.........
నట్టింట్లో వస్తువులతో మృదంగం వాయిస్తూ...
కొంపల్ని కురుక్షేత్రం గా మారిస్తే ఎలా..??

ఉమ్మడి కుటుంబాల వాకిళ్లు పొక్కిలై
మూడుముళ్ల బంధాలు బీటలువారి పరువును బజారున
చల్లుకుంటూ
మూడునాళ్ళకే అపహాస్యం పాలై
దాంపత్య బంధాలు వీగుతూ
కోర్టు మెట్లపై పడిగాపులా...??
ఒక్కసారి నూరేళ్లు వెనక్కి వెళ్ళండి
అవగాహనతో ముందడుగు వేయండి



-అరుణ కీర్తి పతాక.కరాదుల
9395147443

## ఏముందీ పట్నంలో?

పట్నంలో బ్రతుకు
హైటెక్ హంగుల అతుకు
ప్లాస్టిక్ ముసుగేసిన ప్రకృతి
తారు దుప్పట్లు కప్పిన దారులు.
మబ్బులు కమ్మిన ఆకాశంలో
చంద్రుడు తొంగి చూసినట్లు
అక్కడక్కడ కొంత మట్టి నేల
పాదాలకు రబ్బర్ తొడుగులు
చుట్టూ కృత్రిమ వాతావరణం
యాంత్రిక జీవన విధానం.
రికాం లేని రణగొణ ధ్వనులు
ఎడతెరిపి లేకుండా పొగ చిమ్మే గొట్టాలు.
పెట్టిన గడ్డి, పట్టిన దుమ్ము
ఫర్లాంగ్ ఎత్తు ధూళి పొర.
కనుమరుగవుతున్న అడవులు
వినపడని పక్షుల గొంతులు.
జనావాసంలో 'మానవ' పార్కులు
శివార్లలో 'జూ' పార్కులు.
ప(పు)లకరింపులు లేవు
సరస సల్లాపాలకు పొదలు లేవు
గుసగుసలకు గట్టు చాటు లేదు.
అచ్చట్లు ముచ్చట్లు లేవు
కలుపుగోలుకు
సీతాకొక చిలుకల జాడ లేదు.
తాగే నీటికి, పీల్చే గాలికి
స్వచ్ఛత లేదు.
ఏముందీ పట్నంలో?
ఎందుకీ
నవ్య నాగరిక బ్రతుకు?



-ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007

## పుష్టకాంతి

జీవ హింస జేసిన జీవము బోవు
ప్రాణ బిక్ష బెట్టిన ప్రాణిలు బ్రతుకు
దయను కలగి నున్నను ధన్యమే బ్రతుకు
పుండలీకు పలుకులు పుడమి వెలుగులు

ప్రాణి నున్న చోటనే ప్రకృతి వెలుగు
వనము కల్గి యున్నచో వానలు కురియు
మంచి కలిగి యున్నచో మర్యాద తక్కు
పుండలీకు పలుకులు పుడమి వెలుగులు

కీడు జేయ దలచిన మూడును హాని
చెడ్డ పనులు జేసిన చెడెదవు నీవు
చెడును జేయ దలచిన చెడిపోవు మనుషులు
పుండలీకు పలుకులు పుడమి వెలుగులు

జైత్రయాత్ర కన్నను చైతన్య మదియు
ప్రజల బాగు గోరుతు పయనము జేసె
కవులు కలిసి నడువగ కవియాత్ర సాగె
పుండలీకు పలుకులు పుడమి వెలుగులు



-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

# నానీలు జీవన సత్యాలు



– సునీత బండారు
9440671530:

**కానుక**
అభిమానంతో
ఇచ్చేది
అత్యున్నత స్థాయికి
దోహదపడేది..!

**విషము**
తేనె వంటి మాటల్లో,
కనిపించే చిరునవ్వు
మాటున దాగి
పయనించేది ..!

**మమకారము**
మాటలకందనిది
చేతలతో తెలిపేది
ప్రేమాభిమానాలు
పంచేది ..!

**విధి**
క్షణంలో నీ
అంచనాలను
తారుమారు చేస్తూ
వెక్కిరించేది ..!

**జాప్యం**
కొద్ది జాగు
జీవితకాలం మూల్యం
చెల్లించుకోవాల్సి
వస్తుంది ..!

**అధికారం**
అందరికీ దూరం
చేసేది
బాంధవ్యాలను
మరిచేలా చేసేది ..!

**కష్టం**
నేడు చిందించే
చెమట బిందువు
రేపు బంగారంగా
మారేది ..!

**దుస్తులు**
సంస్కారాన్ని,
వ్యక్తిత్వాన్ని చూపేవి
నీవేమిటో
తేటతెల్లం చేసేది ..!

**కులం**
సామాజిక స్థాయిని
తెలిపేది
తమ ప్రభావాన్ని
చూపేది ..!

**నిశబ్దం**
కొత్త ఆలోచనలు
తెచ్చేది
మేధావులు పుట్టుకొచ్చే
నెలవు ..!10

**వెలుగు**
అంధకారమైన
జీవితంలో
కాంతి రేఖలు
ప్రసరింపజేసేది ...!

**చీకటి**
భయపడకుండా
ఉంటేనే కదా
వెలుగుకు
దారి చూపేది ...!

**మాట**
ఒక్కసారి
నోరు జారావా
తిరిగి ఎప్పటికీ
దిద్దుకోలేనిది ..!

**నీడ**
తోడు నడిచే దానిలా
అగుపించినా
చీకటిలో
మరుగయ్యేది ..!

**జీవితం**
ఈ పరమపద
సోపానం లో
గెలుపు ఓటములతో
సహవాసం ..!

**అందం**
బాహ్య సౌందర్యం
కానే కాదు
కళ్లతో కాక
మనసుతో చూసేది..!

**ఉత్తరం**
మనిషిని చేరువ
చేసి మాట్లాడించేది
దూరాన్ని కూడా
దగ్గర చేసేది ..!

**ఐక్యత**
కలిసి ఉంటే
బంధం పెంచేది
విడిపోతే
ఓటమి మిగిల్చేది ..!

**వేదాంతం**
దురదృష్టం వెంటాడి
వెల్లువయ్యేది
అదృష్టం తోడైతే
మాయమయ్యేది ..!

**ధనం**
అహంకారపు
మెట్ల మీద
అంతులేని
ఆనందం పొందేది ..!

**అదృష్టం**
సాహసించే వారి
వెనకే నడిచేది
పిరికి వాని ముందు
పరిగెత్తేది ..!

**జ్ఞానం**
ప్రశాంతమైన
మనసుతో
నిరంతర పరిశ్రమతో
లభించేది ..!

**వృక్షం**
ఎంత హింస పెట్టినా
బాధను దాచుకునేది
అమృత ఫలాలు
ఇచ్చేది ..!

**యోగ్యత**
ఎంత దాచిన
దాగనిది
పూల సువాసనలా
పరిమళం నింపేది..!

**ఉద్యమం**
ఆర్పివేసినా
భగ్గున మండేది
అణచివేసినా
ఉవ్వెత్తున ఎగిసేది..!

**విద్య**
గుర్తుంచుకోవాలని
చదివితే రానిది
అర్థం చేసుకుంటే
దక్కేది ..!

**ఉప్పెన**
కళ్ళముందు కదలాడే
అందమైన లోకాన్ని
క్షణ కాలంలో
కనుమరుగు చేసేది ..!

**సూక్తి**
మేధస్సును సాధించే
ఆయుధం
భవిష్యత్తుని
నడిపించే యంత్రం ..!

**వినయం**
ప్రతిభకు తోడుగా
నిలిచేది
విజయానికి నీడగా
నిలిచేది ..!

**పుకార్లు**
అతివేగంగా
పయనించేటివి
శాశ్వతంగా
నిలవనివి ..!30

**నింద**
వేయడానికి
క్షణ కాలం పట్టనిది
చేసిన తప్పు
జీవితాంతం ఉండేది..!

**కపటత్వం**
లోలోపల అభివృద్ధి
చెందేది
పైకి తీయగా
పలకరించేది ..!

**పల్లెలు**
ఆత్మీయతకు
అనురాగాల పొదరిల్లు
నిలువెత్తు
నిదర్శనం..!

**పుష్పం**
వాడిపోతానని
తెలిసినా కూడా
వికసిస్తూనే
ఆకట్టుకునేది ..!

**మేఘం**
కలిసికట్టుగా
ఎలా ఉండాలో
తెలియజేయు
ఆకాశపు అద్భుతం ..!

**మనసు**
మన నేస్తంగా
ఉండేది
శత్రువులా కూడా
చేసేది ..!

**దీపం**
తను కరుతున్నారని
తెలిసినా
కడదాకా
వెలుగులు పంచేది ..!

**కెరటం**
జారి పడతాను
అని తెలిసు
అయినా కూడా
ఎగరక మానదు ..!

**మంచు**
కరిగి తన
ఆకారాన్ని మార్చేది
రుపాన్ని మార్చి
పయనించే అద్భుతం..!

**విజయం**
ఆశయాల తీరంలో
పయనించేది
పోరాటంతో
సాధించే గెలుపు..!

**ఏకాగ్రత**
విజ్ఞానార్జనకు
తొలి మెట్టు
జ్ఞాన సముపార్జనకు
ఏకైక మార్గం..!

**ఓటమి**
ప్రపంచమేమిటో
తెలియజెప్పేది
గెలుస్తే నీవేమిటో
అందరికీ చెప్పేది ..!

**కాలం**
ఎప్పుడు ఏమౌనో
తెలియదు
ఎవరికి అందకుండా
పయనిస్తూ ఉంటుంది...!

**ధైర్యం**
ఒకరు చెపితే
విలువ తెలిసేది
నీలోనే ఉండేది
విజయన్ని ఇచ్చేది ..!

**స్నేహం**
బంధాలకు
అతీతమైనది
అద్భుతమైన
ఇహలోక పెన్నిది..!

**నమ్మకం**
పొందడానికి
ఏళ్ళు పడుతుంది
పోగొట్టుకోవడానికి
క్షణం చాలు ..!

**కన్నీరు**
మాటల ద్వారా
చెప్పలేని విషయాలు
తెలియజేసే
సున్నిత భావం..!

**వెలుగు**
కొత్త ఆశలకు
స్వాగతం చెప్పేది
రేపటి గురించి
తెలియజెప్పేది ..!

**మౌనం**
మనసు విప్పి
చెప్పలేని
ఎన్నో మాటలకు
తిరుగులేని అస్త్రం..!

**జ్ఞాపకం**
ఓ అందమైన
అనుభవం
యుగాలు గడిచినా
ఇగిరిపోని గంధం..!50

**నిరాశ**
పరిస్థితుల్లో కాదు
మనిషి
దౌర్బల్యానికి
నిలువెత్తు నిదర్శనం ..!

**ఇంద్రధనస్సు**
ఆకాశంలో కొలువై
అందరికీ మనసై
సప్తవర్ణాల
శోభితం ..!

**కాగితం**
చిత్తు ముక్కలా
అనిపించినా
అణ్వాయుధాన్ని
మించిన శస్త్రం ..!

**బాధ**
ఉంచుకుంటే
రెట్టింపు చేసేది
పంచుకుంటే
తగ్గుతుంది ..!

**లక్ష్యం**
అనుబంధాలకు
కళ్లెం వేసిది
కఠిన నిర్ణయాలుతో
గమ్యాన్ని చేర్చేది..!

**ప్రేమ**
మనసులో నుంచి
వచ్చేది
మరణించేదాక
వెంట ఉండేది..!

**సంతోషం**
ఇతరులకు
సాయం చేసి
వాళ్ళ ఆనందంలో
తృప్తిని పొందేది ..!

**స్మృతి**
జీవితాంతం
వెంటాడేది
నిత్యం పలకరిస్తూ
తోడుగా ఉండేది..!

**స్నేహం**
మంచివారితోడు
శిలాక్షరం
చెడ్డవారితోడు
నీటి పై రాత ..!

**వీడ్కోలు**
భారంగానైనా
చివరి మజిలీ
ఇది కాదని
తెలియ చెప్పాల్సింది.!

**అభివృద్ధి**
గతానికి
అవసరమైంది
పురోగమనానికి
మంచి సాధనం ..!

**గతం**
అనుభవాల
చట్రంలో సదా
రేపు తప్పు
చేయనీయకుండా చేసేది ..!

**సంకల్పం**
ఏదైనా సాధించాలన్న
తపన
ఆశయసిద్ధికి
తోడ్పడుతుంది ..!

**కలం**
నుదుటి రాతను
సైతం
నిమిషాల్లో మార్చే
అద్భుత ఆయుధం ..!

**సాధన**
రాదు అనే వారికి
గెలిచి నిరూపిస్తుంది
రాయినైనా
కరిగిస్తుంది ..!

**ధరణి**
అన్నీ తెలిసే
నాశనం చేస్తున్నాం
అయినా ఓర్పుతో
భరించే అమ్మ ..!

**ఆకాశం**
మొదలు ,తుది
లేనిది
వెతుకుదామన్న
అంతు చిక్కనిది ..!

**స్పర్శ**
ఆత్మీయత హస్తం
కొండంత అండగా
ముందుకు
నడిపిస్తుంది ..!

**సంతోషం**
ఉంచుకుంటే
మిగిలిపోయేది
పంచుకుంటే
రెట్టింపయ్యేది ..!

**బాల్యం**
చిలిపితనానికి
కొత్త కోరికలకు
అంతులేని
ఆశలకు ప్రతీక ..!

**వయసు**
ఎంత పెరుగుతున్నా
తరగని మది
కొత్త అనుభవాలకు
పునాది..!

**ఆశ**
ఊహలకు
వాస్తవాలకు
మధ్య లో ఉన్న
సన్నని దారం ..!

**ఓటమి**
అనుభవించినవారికి
తెలుస్తుంది
భవితవ్యానికి
పునాది వేస్తారు ..!

**గొప్పవారు**
ప్రతిఫలం కోరకుండా
అనునిత్యం
ఇతరులకు
సహాయపడే వారు..!

**కల్తీ**
అన్నింటిలోను
ఉండేది
జీవితంలో తప్పక
ఎదురుపడేది ..!

**గాలి**
స్వచ్ఛమైనది
కలుషితం చేసారు
ఎంత వగచినా
లాభం లేనిది..!

**కలలు**
ప్రతి క్షణం
అలోచించాలి
దానిలో భవితను
నిర్మించుకోవాలి ..!

**చేదు**
తినడానికి
ఇబ్బందైన
ప్రతి ఒక్కరు అలవాటు
చేసుకోవాలి ..!

**దిగులు**
మనిషి దైన్యానికీ
ప్రతీక
దీనిలో ఉన్నామంటే
కృంగదీస్తుంది..!

**గడియారం**
కాలం ఎంతో
సూచిస్తుంది
నీవేమి కోల్పోయావో
చెపుతుంది..!

**కవిత**
ఆలోచిస్తే
రానిది
అనుభవిస్తే గాని
అక్షరరూపు దాల్చనది..!

## వర్ష ఋతువులో..

కొన్ని ప్రకృతి వరాలు
పరవశింప జేస్తుంటయ్

చిటపట మంటూ చినుకులు
ఇంటి రేకులపై సరిగమల సవ్వడైతది
వసారా మీదుగా నీటి బొట్లై
రాలుతున్న దృశ్యం
మనసున ముత్యాల ముగ్గుల్ని పరుస్తది
పచ్చని ఆకుల మధ్య తచ్చాడుతున్న
నీటి బిందువులు
వెండి వెలుగుల చుక్కలై మెరుస్తుంటయ్

ఆట పాటల బాల్యానికి
వర్షం ఓ ఆలంబనైన జ్ఞాపకం
గగనాన నీలిమేఘాలు అలుముకుని
చల్లని చిరు జల్లుల్ని చల్లితేచాలు
ఇప్పటికీ మేడ మీదుంచి
దేహం రెక్కలు కట్టుకుని దూకుద్ది

అరటాకులే గొడుగులైన అడుగులు
కాగితప్పడవల్లే కదలాడిన బుడుగులు
వర్ష ఋతువు హర్ష స్మృతులు

వరదలతో ఊరంతా ఉప్పొంగినా
చింతచెట్టు కింద ముసలవ్వ కాల్చిన
మొక్కజొన్న పొత్తులు తింటూ
బషీర్ భాయ్ ఇచ్చిన గరమ్ ఛాయ్ తాగుతూ..
దోస్తులతో చేసే కమ్మని కబుర్లు
మనసున మల్లెలై గుభాళించేవి

సూరన్న రవ్వంత తొంగిచూసినా..
ఠక్కున ఆకాశంలో
పొడుసు కొచ్చిన ఇంద్రధనస్సు
ఆనందాన్ని మోసుకొచ్చిన ఉషస్సయ్యేది
ఏరువాక సాగుతో పల్లెంతా పడుచు పిల్లయ్యేది
హరిత హారాన్ని కప్పుకున్న అడవంతా
కవి కుంచె గీసిన అక్షర చిత్రమయ్యేది..!

-కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

## మా సీమ కన్నీరు పెడుతోంది

పచ్చటి వసంతంలా
నిండు మనసున్న
మా సీమ గుండె
శిశిరంలో రాలు ఆకుల్లా
కన్నీటి చుక్కలు రాల్చుతోంది
మేఘాలు చూపే
గ్రీష్మపు కోపానికి

ఎడారిలా మారుతున్న
మా భూమిని
జీమూతం తన హృదయం నుండి
చిన్న చినుకైనా రాల్చక
కినుకవహిస్తోంది

భూమిని నమ్ముకుని
బ్రతుకుతున్న
రైతు గుండె
ఆగిపోవుటకు
కారణమౌతోంది

ఇసుమంతైనా జాలిచూపక
మా రైతు గుండెలు స్పర్శించక
తీవ్ర ఎడబాటుతో శిక్షిస్తోంది

ఆ పగ పట్టిన మేఘాల
వాలకమే చెబుతోంది
కురిసీ కురవకుండా
ఊరించి ఊరేగే తీరుని

ఇంకా మా సీమనేలపై
కోపం తీరలేదని

ఓ మేఘమా
మా సీమపై ఉన్మాదం మాని
కనికరం చూపి
శిశిరపు ముసుగు వీడి
వసంతమంటి
అమృతపు
జల్లులు కురిపించుమా

స్వచ్ఛమైన ఆకాశమంత
నీ మనసున
అసంకల్పితంగా దూరిన
మసి బారిన నలుపు మేఘాలు
చెరిపి కుండబోత కుమ్మరించుమా

మా సీమను సస్యశ్యామలం చేసి
రాలిపోతున్న మా రైతుల
హృదయాలు వికసింపజేయుమా

ప్రాణమున్నంత వరకు
నిన్ను గుండెల్లో పెట్టుకుని పూజిస్తాం.



-నాగముని. యం
9490856185

## మనసును ఎక్కడో పోగొట్టుకునీ..

అక్కడంతా నిర్మానుష్యం
అది ఏ మృత్యువుల తదనంతరమో
పురాస్మృతుల జాడల కోసం
అక్కడక్కడ కొన్ని యెదల నిట్టూర్పులు

రెండు వెదురు బొంగుల్ని మోసుకొస్తున్న
బక్క పల్చటి నడి వయస్కుడు
కళ్లను కందువాతో తుడుచుకుంటూ
కడలి వద్దకు కదువతో ఒకడు

దిగాలు పడ్డ గుమ్మానికి ఎండిపోయిన తోరణాలు
పందిరి కింద నులక మంచంపై
కళ్లజోడు మూడో కాలుతో ఓ ముసలాయన
వెలగని పొయ్యిబూడిదలో పిల్లి పిల్లలు
ఎనగ్రకు వేళ్లాడుతున్న ఉట్టి తాళ్లపై పిట్ట పిల్లలు

కాలధర్మపు క్రియల్లో
తూలుతూ దు:ఖాన్ని మింగేస్తున్నారు కొందరు
చివరి చూపుకు చుట్టమొకడు వచ్చినట్టుండు
ఏడుపులు పెడబొబ్బలు మళ్లీ షురూ..

చివరి ప్రయాణం మొదలయ్యింది
వాళ్లకు శ్మశానమే లేదక్కడ
ఆరుబైటే అందరూ కేటాయించుకున్నారు

మంగళవారమట పొడెకు కోడిని కట్టాడొకడు
బుక్కాగులాల్ గోవిందా..గోవిందా..
వరుసైన వాళ్లంతా వరుసలు కట్టారు
మనుషులే నడుస్తున్నారు
మనసును ఎక్కడో పోగొట్టుకుని

కొన్ని అడుగులు ఊరవతల అడవి
ఎంత ప్రశాంతంగా వుందో..
మానవ మృగాలేవి లేవక్కడ

నీళ్ల కరువో నిష్ఠ కరువో
ఒళ్లంతా నీళ్లు చల్లుకుంటున్నారు
కన్నీళ్లతో తడిసి ముద్దయిన దేహాన్ని
ఇంకేం తడుపుకుంటారులే..

కొన్ని సత్యాలతో కొన్ని అసత్యాలతో
అక్కడోళ్ల కళ్లల్లో వేదాన్ని నిర్వేదాన్ని పోగేసింది
బతుకుల మధ్య భగ్గుమన్న కాష్ఠం..!



-కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

## మట్టి మనసు

వాన రాకను
ఉప్పొందించిన మేఘానికి
కళ్ళు ఆహ్వానం పలుకుతూ
చల్లని గాలికి తన్మయత్వంలో
తెలియాడుతుంటే...

రాలి రాలి
వాలి వాలి
తొంగి తొంగి
వంగి చూస్తున్న చినుకు చుక్కలు
ఒక్కొక్క మాటలా
ఒక్కొక్క అడుగుతో ముద్దుబిడ్డలా
నేలను పాకులాడుతూ
దారులన్నీ మెలికలు మెలికలుగా
కలయతిరుగుతూ కాలువగా ఎదిగి
కుంటలకు పరిగెత్తి
వాగుగా అవతారమెత్తి ఊరేగుతుంటే

నెత్తి మీద మిన్ను దీవించి
కాలి కింద మన్ను ప్రేమించి
మట్టి మనసు
ముద్దై....బురదై.....బంకై
చంటి పిల్లోడిలా రైతు కాళ్ళని చుట్టేసుకొంటే
ఊపిరి సలపని ఆనందంలో
"పచ్చని కల" వైపు అడుగులు వేస్తుంటే
మట్టి ప్రాణాలు పులకరిస్తున్నాయి.



-చందలూరి నారాయణరావు
9704437247

## మధురవాణి

ప్రతి ఒక్కరికి ఉండాలి లక్ష్యం
చేయకు నీ జీవితాన్ని నిర్లక్ష్యం
నీ అభివృద్దే నీకు ప్రత్యక్షం
నీ మంచి ప్రవర్తన అందుకు సాక్ష్యం

డబ్బు స్థిరంగా ఎవరిదగ్గర నిలవదు
కాలం ఒకేరకంగా ఎప్పుడూనడవదు
కొత్త పోకడలకు కల్తీకాలం సాగదు
మనిషికి మనిషి సాయం లేకుండాజరగదు

కాలం మారుతున్న కొద్దీ మారుతుండేవిలువలు
ఆధునికత తో తగ్గించారు వలువలు
పిల్లలకు ఎంతో ఇష్టం సెలవలు
విలువ తెలియకుంటే జీవితం చిలవలపలువలుం

మూర్ఖత్వం నీవు తొందరగా వీడు
అర్థం చేసుకో అమ్మానాన్నల గోడు
చిగురించును నీ జీవితపు మోడు
విజయం నిలుస్తుంది నీ తోడు

నేడు ఎక్కడ చూసినా కాలుష్యం
పిలుస్తున్నాం మనం ఆ వాయువ్యం
చేయరాదు ఎవరూ దానిని నిర్లక్ష్యం
చూపకండి ఇలాంటి దానిపై వైషమ్యం

వికలాంగులకు మనం చేయూత నిద్దాం
అభివృద్ధి లో వారిని మనం చూద్దాం
అదిప్రతి ఒక్కరి బాధ్యతగా చేద్దాం
వారికి భరోసాగా మనం నిలువుద్దాం

మనిషి జీవనానికి యోగా చక్కనిమంత్రం
జీవితమంటే ఉరుకుపరుగుల తో సాగేతంత్రం
ఆనందాన్ని పంచేటి ఆరోగ్య సూత్రం
అన్నింటిపై వలదు మనకు ఆత్రం

మనిషి మనుగడకు నీరు ఆధారం
నీరు శక్తినిచ్చు నట్టి ఆహారం
ప్రకృతిలోని ప్రాణులకు వస్తువులే సమాహారం
అకుంఠిత దీక్షతో చేద్దాం ప్లాస్టిక్సంహారం

ప్రతి పనికి తప్పకుండును అనుమతి
మంచి జరిగితే అదేమనకు బహుమతి
ఇంటి ఆనందానికి అవసరం ప్రియసతి
ఒకరినొకరు అర్థం చేసుకోకుంటే అధోగతి

మనిషి మనిషిపై ఉండాలసింది అనురాగాలు
పొందాలి మనం అందరి ఆదరాభిమానాలు
మంచి విషయాలపై ఉండాలిమంచి అభిప్రాయాలు
వదిలేయాలి మనలోని పిచ్చి అనుమానాలు

దిశా నిర్దేశాలు లేని గమ్యం
ఏమాత్రం నీకు అవదు రమ్యం
దిక్కు తోచకుంటే అంతా శూన్యం
ప్రతి పనిలో చూపాలిమనం గమ్యం

మన అనుభవాలే భవిష్యత్తుకి నిదర్శనం
మనలోని ప్రజ్ఞకు అవసరం ప్రదర్శనం
తొందరపడి ఎవరినీ చేయకు విమర్శనం
ఒకరిఅనుభవాలు ఒకరు చేసుకోవాలి సమ్మేళనం



- కె. శైలజా శ్రీనివాస్
8019736250

## మెరుపులు

అమ్మకు నవమాసాలు
పురిటి నొప్పులు
నాన్నకు బ్రతికినన్నాల్లు
ఒంటి నొప్పులు !!

నాన్న నలిగిపోతడు
అవమానాలన్నింటిలో
నాన్న ఇబ్బందిపడతడు
కష్టాలన్నింటిలో !!

నాన్న దుఃఖాన్ని
కడుపులోనే దాచుకుంటడు
నాన్న బాధల్ని
గుండెలోనే దిగమింగుకుంటడు !!

నాన్నకు ఎపుడు
పిల్లలపై ధ్యాస
పిల్లలు పుట్టినపుడు
ఒదలనని చేశాడుబాస !!

నాన్న తోడుంటే
కొండంత బలం
నాన్న లేకుంటే
ఇల్లు ఎండినపోలం !!

పిల్లల భవిష్యత్తుకు
తహతహ లాడుతడు
వారి ఎదుగుదలకు
తలతాకట్టు పెడతడు !!

నాన్న సంతోషాలను
మనతో పంచుకుంటడు
నాన్న దుఃఖాలను
ఎదలోనే దాచుకుంటడు !!

నాన్న ముందుండి
కార్యం జరిపిస్తడు
నాన్న అడ్డముండి
కష్టాలను తొలగిస్తడు !!

నాన్న వుంటే
ఇంట్లో పులివున్నట్లు
నాన్న లేకుంటే
చలికూడ చంపుతదన్నట్లు !!

అమ్మ పేరుమీద
రచించారు ఎన్నోబుక్కులు
నాన్న పేరుమీద
మిగిలేవి హక్కులు !!

నాన్న ఎంతపనిచేసినా
అమ్మకన్న తక్కువంటం
ఎవరన్న కొట్టినా
"అమ్మా" అనేఅంటం !!

నాన్న బరువుమోసే
మునగని పడవ
అమ్మ నీటినిమోసే
పగలని కడవ !!

ఇంటికి ఇద్దరు
రెండు కండ్లు
కలిసి వారిద్దరు
అడ్డుకుంటరు వడగండ్లు !!

మాతా పితలకు
వందనాలు..
జన్మనిచ్చిన తలిదండ్రులకు
అభివందనాలు.. !!



-తాండ్ర చిరంజీవి
9959180762.

## వృక్ష సంరక్షణ

కరకు గొడ్డలితో నరికిన
కరుణ చూపే వృక్షాలు

మ్రోడుగా మార్చేసిన
మారాకు వేస్తుంది

విసురుగా రాళ్ళు విసిరిన
విసుగు పడక అందిస్తుంది
తీయని పండ్లనే

తిని పారేసిన పండ్ల విత్తనాలు
చినుకు తడి తాకి మొలకెత్తి
మహా వృక్షమై నిలిచిపోతుంది

పుట్టిన నాడు ఊయలగా
చచ్చే రోజు పాడెకు చెట్టే ..
కాల్చి బూడిద చేసే వరకు
అన్నింటికీ అవే మనకు

అయినా జ్ఞానం లేనిది మనకు
ఉపయోగించడమే తెలుసు
తెలియదు కాపాడటం

ముందు తరాలకు ఆరోగ్యం
భూమి మీద బ్రతికే సౌకర్యం
ఉంటుందో లేదో!

రక్షించుదాము వృక్ష జాతిని
భవిష్యత్తును చుపుదాము
ముందు తరాలకు!



-లక్ష్మి మదన్
9959186838

## స్నేహ ద్విపదలు

స్నేహం హృదయం తో ఐతే
అది నమ్మకాల మీద నిలబడుతుంది

స్నేహం ప్రేమతో ఐతే
అది అనురాగాల వలపు పల్లవైతుంది

స్నేహం గౌరవం తో ఏర్పడితే
అది జ్ఞాపకాల గుడిగా నిలుస్తోంది

స్నేహం మానవుడి తో ఐతే
అది జీవిత జ్ఞానాన్నిస్తుంది



-రేడియమ్
9291527757

## బాధ్యతల మెలుకువ నాన్న

ఆప్యాయతలు పరిచిన నీ
ఎద మైదానంలో నామెత్తని
పాదాల కంటిన వికసించిన
నీ మది చిరునవ్వులు
ఇంకా నా గుండె సొరుగుల్లో
చరించే సజీవ ఉత్ప్రేరకాలే నాన్నా..

నీ త్యాగాల నాగలి గుండెకోతలతో
నీదేహానికిఅయిన గాయాలు చిమ్మిన
రక్తం, చర్మం చిందిన స్వేదం,
కాలే బాధల
కట్టెలకు పొంగే అశృవులతో
తడిసి నీ సహన ధాత్రిలో
మొలిచిన మొక్కను నాన్నా...

నా కేరింతల బోసి నవ్వులను
నీఎదజోలెలో కుమ్మరించుకొని
మురిపాల తీరాలలో పక్షివై
మురిసిపోతున్న క్షణాల్లో రాలిన జ్ఞాపకాల
ఈకలు నాహృదిని
సుతారంగా స్పృశిస్తూ నాశిశుత్వాన్ని తడిమే
మధుర ధారవు నాన్నా...

వేలు పట్టుకొని నడిచిన
ఆస్పర్శ నన్ను
తడబడకుండా నిలబడే
ఆత్మ బలమై ఇంకా
నీ వెంటే తలెత్తుకొని జీవన ఇంధనమై
నడిపిస్తున్నది నాన్నా...

మల మూత్రాలకు కూడా
మైలపడక అపురూప
పవిత్ర వడపోతల ప్రేమలై
ప్రవహించే నదులకు
జన్మనిచ్చిన అఖండ
అనురాగాల మేరు పర్వతం నాన్నా...

నీ ఎద పాన్పు మీద
అదమరిచి నిద్రపోతున్న
నా చిరు కాయాన్ని
అమెరికా అధ్యక్షుని రక్షణ శ్రేణిలా
కాసే కాపలా
కవచమై ఆత్మీయ మొలకలై మొలిచే
ప్రేమల మెలుకువవు నాన్నా...



-కొప్పోలు యాదయ్య
9494273703

## నల్లమబ్బు ఉరిమితే...

అగ్రరాజ్యానికే కాదు
ఆ గగనానికి కూడా
జాత్యహంకారమే
అందుకే..
నల్లని మబ్బులను క్రిందకు నెట్టేసి
ఆ తెల్లమేఘాలనే
తన ఒడిలో ఆడిస్తుంది
కానీ దానికి తెలియదు
ఈ నల్లమబ్బులు శ్రమిస్తేనే
ఆ శ్వేత సౌధాలు నిర్మింపబడ్డాయని
అయినా వాటికి తెలియదు
ఈ నల్ల మబ్బు ఉరిమితే
ఆ గగనమైనా
అగ్రరాజ్యమైనా
గజగజ వనకాలసిందేనని
బంకర్లలో దాకోవాలసిందేనని



-కవిశ్రీ
9493785596

## కరోనా శతకము

రొట్టెలు, దోసెలు, ఇడ్లీ
లిట్టే చేయుటను నేర్చి రింటను పురుషుల్
తుట్టెలు, బూజులు దులుపుచు
బట్టల పని అంట్ల పనుల బడిరి కరోనా !

పాజిటివు ఘన మొకప్పుడు
పాజిటివే తీయుచుండె ప్రాణములిపుడున్
మోజా పదమానాడే
రాజేసితె నిప్పు మాకు రౌడి కరోనా !

పప్పును అన్నము కూరను
కప్పెదు 'టీ' సతికి నిచ్చు కటకట ! పతికిన్
నిప్పుల కాలమ్మాయెను
ఒప్పుల కుప్పకును పండువోయి కరోనా !

బోరును ఫీలగుచుండిరి
సారులు మరి అమ్మగార్లు చాచియు కాళ్లే
చీరను మార్చెడు పనిలే
దారడి పెట్టగను లేదు అయ్యొ కరోనా !

భయమును, బెదురును లేకయె
నయముగ, శ్రద్ధగను ఇంట నాడుండుటచే
జయమును నీపై నొసగు, స
మయమిప్పుడె చూడవలయు మాయ కరోనా !

తెలతెల వారగ ప్రాంగణ
మలరించ కలాపి చల్లి, అందముగా, తీ
రుల ముగ్గుల శోభిల్లన్
జిలుగుల నద్దుటయె మాకు సిరియె కరోనా !

దూరమునే పాటించుచు
దూరకయే సందులందు దొంగలవోలెన్
నేరము చేసిన రీతిని
సార విహీనముగ బ్రతుకు సాగు కరోనా !

ఒక వంకను రెడ్‌జోనని
ఒకటను గ్రీన్జోననంగ ఒదలెను 'స్వేచ్ఛన్'
తికమక బెకబెక అంతట
సకలము మద్యమ్ము పారసాగె కరోనా !

కొందరు సోమరిపోతులు
కొందరు యువతీ యువకులు కోతులె కాగా
కొందరు బొజ్జలు పెంచిరి
ఎందరొ మతికోలుపోయిరెరుగు కరోనా !

చూచిన మొగమే చూచుచు
కాచిన తేనీరె మరగ కాచుచు స్టౌపై
దాచిన బట్టలె దాచుచు
తోచక ఉన్నాదులైరి ధూర్త కరోనా !



-చిమ్మపూడి శ్రీరామమూర్తి
సెల్: 9704177270

## ఆకలి నడక

పుట్టినప్పటి నుండి
నడక ఆగటం లేదు
రోడ్డెక్కిన పాదాలకు
గమ్యం దొరకటం లేదు.

భూమిగుండ్రంగా ఉంది
ఎక్కడ మొదలయ్యాయో
నడక అక్కడికే సాగింది
వలస ప్రయాణపు దారికి
ఎన్నడూ అంతులేదు.

ఆదరించిన పట్నాలు
పోపొమ్మంటున్నాయి
ఊర్లు రమ్మని పిలుస్తున్నాయి.

అకస్మాత్తు అర్ధాంతపు
ఆకలి ప్రయాణానికి
చెట్టు ఇల్లయింది
రోడ్డు పడక గది అయింది
ఆకలికి కాలువ నీళ్ళే
గొంతులో అమృతమైంది...

వలస బతుకులు
తలా తోక లేకుండా
ముందు వెనుక
తిరుగుతూనే ఉన్నాయి...
దిక్కులేనిచోట
అలసిన ఆకలి పోరాటాలు
నది ప్రవాహం ఒక్కసారి
ఇంకిపోయినట్టు
అన్ని విడిచి పెట్టి నడుచుడే.

వలస కొత్త కాదు గాని
వేల మైళ్ళు నడవడం ఎంత గోస.

కర్ఫ్యూలు, పస్తులు
తెలియక కాదు గాని
నెలలకు నెలలు
ఉపవాసాలుండడమే పెద్ద శిక్ష.

బక్క చిక్కిన పెయ్యికి
మళ్ళీ ముసలి పేగు
గోరు ముద్ద ఊపిరి పోసింది...



-ఎలగొండ రవి
9848770345

## సాగనియ్ ప్రయాణం

భూగోళాన్ని కరోనా మేఘమేదో కమ్మేసింది.
నగ్నంగా ప్రపంచపు అంతర్భాగంలోకి
చొచ్చుకొనిపోయి, నాలుగు దిక్కులకు
ఇరువైపుల మోకరిల్లి, పులి చంపిన
నెత్తుటి వాసనేదో కమ్ముకుంది.
ఒక్కొగీతా చెరిపేస్తూ,
మన బతుకుకు సున్నాగా చుట్టేస్తుంది.
ఒక్కో రేకు తెంచుతూ,
మన జీవితాలను నెలరాలుస్తుంది.
గొంతు పెగలని రాగమేదో ఆలపిస్తున్నట్లు,
ధరణి చుట్టూ, నిశ్శబ్దపు
సంగీతం ఆవరిస్తుంది.
గాయపడ్డ జీవితానికి
ఒకింత దుఃఖాన్ని కడుక్కొని,
నిన్ను నువ్వే మేల్కొల్పుకోని,
నీకు నువ్వే శక్తిని కూడగట్టుకో.
కరోనా గాలి విస్తున్న వడగాల్పులకు,
జీవిత దీపాలను ఆరిపోనివ్వకుండా,
కోరికల పాదరసం అంటని అరచేతులై,
రక్షణ కవచంగా నిలబడు.
కంటి చాటున దాగిన కన్నీటిబొట్టును,
దిగమింగుకొని గుండెనిబ్బరం చేసుకో.
చీకటి ఆవరించిన పొరలను చీల్చుకుంటూ,
నిర్బంధపు గీతలను గీసుకొని,
హద్దులు మీరి, నీ హద్దును దాటకుండా
సాగనియ్ నీ జీవిత ప్రయాణాన్ని.



-అశోక్ గోనె
9441317361

## నీ రాక గుణపాఠం

అమ్మమ్మ చెపుతున్నప్పుడు
అర్థం కాలే
బామ్మఅరిచి గీపెట్టుకున్నా వినలే
తాతయ్య రారా భూమి కొలతలునేర్చుకో
బువ్వ దొరుకుతుంది
అన్నా వినలే
ఊరూ వాడా, చేనూ చెలకా తిరిగి తిరిగి వచ్చి,
తిని
మళ్ళీ తిరగడం కోసం బయటకు పయనం.
నిత్యం ఇదే పని
ఇష్టం అనిపించిన రోజు బడి
లేదంటే ఇంటికి పక్క హనుమాన్ గుడి.
నా చుట్టూ నాలాంటి జనం,
అప్పుడు నేను మూకసేన నాయకుడను.

పొలాలు, చెలకలు,
మోటబావి కాలువ నీరు
పచ్చని పంటపొలాలు,
మన చెలకలో వేరుశెనగ పంట ఉన్నా
పక్కవాడి చేలో శనగకాయ రుచి వేరు
అమ్మమ్మ చెప్పినా వినలే
బామ్మమాట చెవిన పెట్టలే
తిరిగి తిరిగి నగరం చేరిన నా జీవికి
ఎక్కడ వెతికినా
కమ్మని మట్టి వాసన కరువు
చల్లటి చెలిమె నీరు కరువు
చల్లటి గాలి కరువు
మంచిమాటకరువు
మంచి తోడు కరువు
మనుషుల్లో మనసు కరువు
భోగభాగ్యాల భాగ్యనగరం
అన్నీ కరువే.
నన్ను నేను తెలుసు కునే లోపు,
నేను ఏం చేస్తున్నది తెలిసే లోపు
ప్రకృతి ప్రళయం మొదలు
నాలో ఉన్న మనిషిని వెతికితే
నా చుట్టూ ఉన్న పరిసరాలను చూస్తే
నా స్వార్థం కోసం నేను చేసిన తప్పు లేన్నో
దేన్నీ వదలలేదు
అన్ని నా స్వార్థం కోసం నాశనం చేశాను
అద్దాల మేడల మధ్య
అబద్దాల జీవశ్చవాన్ని
నాకు నేనే గొప్ప అని
అన్ని నాకే తెలుసు అని
విషపు ఆలోచన తో
భూమిని, నీటిని, గాలిని
మనసు లోని ఆలోచనలను
మనిషికి, మనిషి కి మధ్య
బంధాలను దూరం చేసిన వాడ్ని
నేను నేను గా ఉండనందుకు
నాకీ శిక్షఅవసరమే
నీ రాక మేలుకొలుపు
నీ రాక ఓ జీవితకాలపు గుణపాఠం
నేను మారుతా
నీకోసం కాదు
నాకోసం
నా ముందు తరం కోసం
మన్నించి వెళ్లి పో
మళ్ళీ రాకు
నీకు ఆ అవకాశం ఇవ్వను
ప్లీజ్ కరోనా వెళ్లిపో
వెళ్ళిపో.. వెళ్ళిపో..



-పరాంకుశం నారాయణరావు
9908229221

## మనసుకు పొర

ధరించు మాస్క్ ముఖానికి మాత్రమే
మనసుకు వేయకు కపటపు పొరను

కనపడని క్రిమితో పోరాటం సలుపు
కనపడే రోగిని వెలి వేయకు చెంతనుండి

అధరము దరహాసం చిందించినా
అంతరం ను కలుషితం చేయకు

తీయని పలుకులు పలుకుతూ
విషమును చిందించకు మరో ప్రక్క

కలువ కన్నులు కరుణనే చూపాలి
కాఠిన్యపు వైఖరిని కానే కాదు

ఆత్మనే దర్పణమై వేలెత్తి చూపుతుంది
తప్పు లెన్ని నీలో ఉన్నా !

అంతరాత్మను నమ్ముకుని నడిస్తే
అచ్చమైన స్వచ్ఛమైన మార్గమే నీది

మాస్క్ నిరోధకము క్రిములు దరి చేరకుండా....
తెరచి ఉంచు మనసును
అంతా కనిపిస్తారు మనంగా!



-లక్ష్మి మదన్
9959186838

## కరోనా ఆటవెలదులు

పొరుగు దేశ పురుగు పరుగులు దీయుచు
జగతి జేయుచుండె జైత్రయాత్ర
మందులేక జనము మరణించు చుండిరి
రేపు నువ్వు మిగుల దాపునుండు!

ముందుచూపు లేక మూర్ఖులందరు నేడు
కీడు దెచ్చు కొనగ రోడునెక్క
చావు పిలుచు నిన్ను చల్లగా ఓరన్న
కల్లగాదు రాచమల్ల మాట!

చేయి చేయి కలిపి చేటు దెచ్చుకొనకు
అమిత ప్రేమ తోడ కౌగిలొద్దు
చేతులెత్తి మొక్కు చెలిమితో నెల్లరన్
దూరముండు టిపుడు దొరతనంబు!

జలుబు దగ్గు తోడ జ్వరమున్నచో నీవు
వేగిరమున వెళ్ళు వెజ్జు కడకు
వినక మిన్నకున్న ప్రాణమునకుముప్పు
కల్లగాదు రాచమల్ల మాట!

తెల్లకోటు దొడిగి చల్లనిచూపుతో
యముని పాశమునకు నడ్డునిలిచి
యలుపుసొలుపు లేక సలుపుచుండిరిపోరు
వైద్యశాలలందు వైద్యులిలను!



-రాచమల్ల మల్లికార్జున్
9441565466

పుస్తక సమీక్షలు

## నిత్య మంగళమైన "నీతి సుధాలహరి'






తెలుగు సాహిత్యం 'పద్యం' తోనే ఆరంభమయ్యింది. చందస్సు తెలిసిన వారే పద్యం రాయగలరు. అందుకే తెలుగు భాషా పరిజ్ఞానం ఉన్నవారు మాత్రమే పద్యం రాయగలిగేవారు. సమయస్ఫూర్తితో, అక్కడి సందర్భాన్ని అనుసరించి, సునిశితంగా, వ్యంగ్యంగా, చతురంగా పద్యాలు ఆనాడు రాజుల ఆస్థానంలో వినిపించేవి. పండితులను పేరుతో వారు తమకు వచ్చిన బిరుదులను సైతం తమ పేరు ముందు పెట్టుకోవడానికి సంకోచించే గొప్ప ఔన్నత్యం కలిగివుండేవారు. అంతటి గౌరవమైనది పద్యం. కందమైనా, సీసమైనా, ఆటవెలది అయినా, ఏదయినా మధురామృతమే. ఇది నీతికి సంబంధించిన రచన. శతకం కాదు. కానీ ఏ పద్యమునకు ఆపద్యం నీతి బోధకమై సమాజానికి సన్మార్గమును చూపే రీతిలో కవి కోట శ్రీరామమూర్తి రచించడం కడు ప్రశంసనీయం.

కోట శ్రీరామమూర్తి కేవలం పద్యమాలతో తెలుగు తల్లిని పూజించారు. నీతిని పుష్పాలుగా మార్చి ఆ తల్లిని అలంకరించారు. ఆటవెలదులు, కందం, తేటగీతి లాంటి చందస్సులతో చక్కని భావాలను తెలియజేస్తూ, మరోవైపు కష్టనష్టములను ఎదురుచూసే జీవులను ఓదార్చుతూ తెలుగు భాషామతల్లికి మంగళహారతులను అందించారు. పద్యమైనా, వచనమైనా ఆయా సంబంధిత వస్తువులోనో, వర్ణనలోనో తాత్త్వికత తోడయితే మరింత భారంగా మారేందుకు అవకాశం ఉంటుంది. వీరి పద్యాలలో కూడా దైవస్తుతి, గురువందనం వంటివి పొడచూపడం ప్రత్యేకత. ఎన్ని కావ్యాలను, ఎన్ని కవితలను రచించినా సమాజపు తీరుపైన, తెలుగు భాషపైనా ఇంకా ఏదో మిగిలే వుంటుంది అని మరోమారు వీరి రచన ద్వారా తెలియజేసారు ఈ కవి. "మసకబారెను తెలుగింట మాతృభాష/ ఆంగ్లమనినను జనుల కాసక్తి మెండు/ వీధి వీధిన కాన్వెంట్లు అధికమయ్యె/ ఎటులపోవును ఈ దేశ మెవరికెరుక" అని వాపోతారు. "మమ్మీడాడీ సంస్కృతి/ ముమ్మాటికి వదలవలయు మురిపెను ఏలన్" అంటారు. ఒకవైపు రైతుల బాధ, మరోవైపు "కానరాడు వాడు కన్నీరు కార్చిన/ వినడు మనల గోడు వివరముగను/ మనిషి జన్మనిచ్చి మరిచాడు మమ్ముల/ తనువుకెంత బాధ మనుట ఎట్లు" అనే దైవారాధన, తర్వాత "ధర్మాత్మునకు న్యాయ రక్షణలో ఎవరైననూ ఒకటేనని" అనే వైరాగ్యం తెలిపే తీరు ఎంతో రమ్యంగా నడిచింది. "సతియనను సుతుడైనను" బంధములు తెంచుకోవలసిందే అనే వాస్తవాన్ని తెలిపిన తీరులో ఆర్ద్రత కనిపించింది.

కవి కోట శ్రీరామమూర్తి పై వివరములే కాకుండా యువకుల ప్రవర్తన, యువతల వస్త్రధారణ, మనిషికి అనర్థాలైన కోపము, క్రోధము, కామము, అత్యాశ, మూర్ఖత్వము, మద్యపానము, అబద్ధాలు, ఎంతవరకు న్యాయమని ప్రశ్నించే ధోరణిలో సాగిన పద్యాలు ఎంతో ఆసక్తికరంగా సాగాయి. ఇందు అర్ధాలంకారములకు, శబ్దాలంకారములకు ఎక్కడా తావివ్వకుండా పద్యాన్ని అతి సరళమైన భాషలో సామాన్యులకు కూడా అర్థమయ్యే ధోరణిలో రచించారు. వీరికి నా అభినందనలు

ప్రతులకు: కోట శ్రీరామమూర్తి ఫోన్: 93978 78247

## ఆసక్తికరమైన విశేషాలతో 'హైదరాబాద్ టు అమెరికా'






మనిషి జీవితంలో ప్రతి రోజూ ఒక విశేషమే. ఏ రోజుకారోజు జరిగే సంఘటనల వల్ల, ఎదురయ్యే మనుషుల వల్ల అనేకానేక అనుభవాలతో జీవితం ఎంతో ఉన్నతంగా తయారవుతుంది. ఒక శిల ఎన్నో దెబ్బలు తిని భగవంతుని రూపంలోకి వచ్చినట్లు, ఒక మనిషి ఎన్నో ఎదురుదెబ్బలు తిని పరిపూర్ణవ్యక్తిగా తయారై ఉన్నతంగా పదిమందికీ తనఅనుభవ సారాన్ని పాఠాలుగా చెప్పగలిగే స్థాయికి, వయసుకు వస్తాడు. అలాంటిది ఒక దేశం వదిలి మరో దేశానికి వెళితే.. ఎన్నో అనుభూతులు, ఎన్నెన్నో అనుభవాలు. చెబుతూ ఉంటే చెప్పాలనే ఉంటుంది. వినేవారుంటే ఆనందాన్ని పంచుకోవాలని ఉంటుంది. డా॥ జయరాములు హైదరాబాద్ నుండి అమెరికా ప్రయాణం చేసి, అక్కడున్న మూడు నెలల్ని అద్భుతమైన అనుభవాల గ్రంథంగా అందజేయడం హర్షణీయం. ఒక ప్రయాణం చేస్తే ఒక జీవితానికి సరిపడా అనుభవాలు ఎదురవుతాయి. కానీ అక్కడికి వెళ్ళి పిల్లలతో ఆనందపు ఘడియల్ని ఫోటోలలో బంధించి కొందరు చూపుతుంటారు. చాలా కొద్దిమంది మాత్రమే అనుభవాల్ని అందమైన గ్రంథంగా రూపొందించి పాఠకులకు అందిస్తారు. నిజానికి ఈ గ్రంథం చదివాక అమెరికా రూపురేఖలు, అక్కడ వారి ప్రవర్తన, అక్కడి వాతావరణం, మనుషుల మనోగతాలు నాకు ఎంతగానో అవగతమైంది. ఆర్థికంగానే కాదు, ఒక రకంగా అనేక విధాలలో మనకంటే కొన్ని యోజనాల ఎత్తున్న అక్కడి వాతావరణం, వారు ఉపయోగిస్తున్న టెక్నాలజీ వల్ల ఉపయోగాలు వింటుంటే ఎంతో ఆనందంగా అనిపించింది. ఇండియా మన దేశం. ఎంత సుందర ప్రదేశాలను చూసినా మనకు ఇంటిని మించిన స్వర్గం ఎక్కడా ఉండదు కదా అనిపిస్తుంది.

అలాగే ఎన్ని దేశాలు మనం తిరిగి వచ్చినా మన దేశంలో ఉన్నంత ఆనందం మనకు ఎక్కడా కనిపించదు. కాకుంటే శుభ్రత, పర్యావరణం, పనులపై అక్కడివారికున్న ఏకాగ్రత ను తెలుసుకుంటుంటే మన దేశం ఎప్పుడు ఇలా పర్యావరణాన్ని కాపాడుతూ తెలివైనవారికి ఇక్కడే అవకాశమిస్తూ ఉంటుందా అని ఆలోచన కలిగింది. కాకుంటే జయరాములు గారికి తమ కుటుంబ సభ్యుల ఆప్యాయత, చూపిన ప్రేమ కూడా ఇంత ఆనందాన్ని పొందడానికి కారణం అయ్యిందా అనికూడా అనిపించింది. మన దేశం వారు వారి దుస్తుల్ని , వారి పోకడల్ని అరువు తెచ్చుకుని తెలుగు భాషను మరచి ఆంగ్లంలో మాట్లాడుతూ తయారవుతుంటే, అక్కడివారు మన సంస్కృతిని ఎంతగా గౌరవిస్తున్నారో తెలుసుకుంటుంటే చాలా ఆనందంగా అనిపించింది.

ప్రతి బిడ్డకు తల్లితండ్రులే మొదటి గురువులు. కానీ నేడు వారే తమ పిల్లల్ని విదేశాలకు పంపాలని, ఆడపిల్లలయితే విదేశాలలో ఉన్నవారికే ఇచ్చి వివాహం చేయాలని అనుకుంటుంటే ఇక ఈ తరం ఎలా మన దేశాన్ని ఆదరించగలుగుతుంది. మన దేశంలో ఉండటానికి కూడా ఇష్టపడని పిల్లలున్న ఈ దేశంలో మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల కన్నవారు చెప్పకుంటే ఎలా తెలుస్తుంది. విదేశాలు విహారానికి మాత్రమే.. స్వదేశాలు సువర్ణ ద్వారాలు అని తెలియజెప్పే ఈ అనుభవ గ్రంథానికి జోహార్లు. డా॥ జయరాములు గారికి నా నమస్సులు..

ప్రతులకు:
శ్రీమతి బి. ఛాయ
ఫోన్: 98498 74207



-శైలజామిత్ర
9290900879

## నేనేం చేయనూ

నా వలలో చిక్కితే
ప్రమాదమని తెలిసినా
కొందరు
పండుగలని,పబ్బాలని
ప్రయాణాలు చేస్తున్నారు
కరోనా బారిన పడుతున్నారు.

భౌతిక దూరం పాటిస్తేనే
బతుకుదెరువని తెలిసినా
మరికొందరు
తమకేం పట్టనట్టు
రాసుకుపూసుకు తిరుగుతున్నారు
ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.
ముఖానికి మాస్క్
పెట్టుకొమ్మని
ఎంత మొత్తుకుంటున్నా
నిబంధనలకు మస్కా కొట్టి
నా వాయు వేగానికి
రాచ బాటలు వేస్తున్నారు
ఇంకొందరు.

నేనేం చేయనూ??
నా కర్తవ్యం నాది
స్వీయ నియంత్రణ పాటిస్తూ
విలువైన ప్రాణాలను
కాపాడుకోవాల్సిన
కనీస భాద్యత మీదే మరి...



-బస్వ రాజ్ కుమార్
9392006080

## ఆవేదన

తర్లుకొస్తున్నాయి
కరోనా కాటుతో సెలవులు అటు ఇటు అయ్యాయి...
మనుసు సముద్రం లోతు అంత
భావోద్వేగాలతో కొట్టుమిట్టాడుతోంది
కాలేజి ముందు సామూహికంగా పాడే
జాతీయగీతం..
నా తెలంగాణ గీతం గొంతులో
ధ్వనిస్తూనే ఉంది..
నా పిల్లల నోటా ముగబోతుంది అనే
వ్యధ తొలుస్తుంది
పిల్లల చిలిపి చేష్టలు.
ఎస్ సర్ అనే అటెండెన్స్ కూతలు
నల్ల బల్ల పై చేతి రాతలు లేక
ప్రత్యేక్ష బోధన లేక సచ్చుబడ్డ ప్రాణమై
కుంచించుకపోతుంది
కులమతాలు లేకుండా
ఒక ఉద్యావనంలోని పూలు
వృధా అవుతున్నాయి
విలువైన విద్యను పేదోడికి
దూరం చేసిన కరోనా చూపు ఇకనైనా జాలి.
నోట్స్ రాస్తున్నట్లు నటిస్తూ
జవాబులు చెప్పాలన్నా ఆత్రుత
పుట్టిన రోజు చకలేట్స్
పంచాలన్న ప్రేమ వాత్సల్యం చిన్నవాయే
పాత నీరెల్లి కొత్తనీరు రాకపోయే ఆన్లైన్ క్లాస్ ల
మాయాజాలం ఆగకపోయే
సర్కార్ కాలేజి వాడు
బిత్తరపోయే
ప్రత్యేక్ష బోధన కేది సాటి
బోధించే లెక్చరర్ గా
మూగావేదన దిక్కు అయే
చదువు అందుకోలేక ఒక పక్క..కరోనా మరో ప్రక్క
ఎన్నో ప్రశ్నలు తొలిచి వేస్తున్నాయి
కలిచి వేస్తున్నాయి
ఓ కాలమా చూపు నీవైన
పసి బిడ్డను దూరమైన
మాతృమూర్తి వేదన ల
కుమిలి కుమిలి నలిగిపోతున్న నాకు
కరోనా పోవాలి
నా పేద పిల్లకు పెద్దగా బోధించాలి అనే
ఆత్రుత...ఆశగా...సాగుతూ



-ఉమశేషారావు వైద్య
9440408080

## క్షమాపణ

చేసిన తప్పును తెలుసుకొని క్షమాపణ అడిగితే క్షమించవచ్చు
తెలియక చేసిన తప్పును క్షమించవచ్చు.
కొందరు తప్పులు చేస్తూనే ఉంటారు. క్షమించమని అడుగుతూనే ఉంటారు.
కొందరు తప్పు చేసినా, ఒప్పుకోరు క్షమాపణ కోరరు.
మరికొందరు
చేసిన తప్పును గుర్తించి నిలదీస్తే, దొరికిపోయాక చేసేదేం లేక క్షమించమని పశ్చాత్తాపం నటిస్తారు.
కొందరు తప్పు చేసి కూడా కప్పిపుచ్చుకుంటూ అధికారం చెలాయిస్తారు,
మనం ఎదురు తిరిగితే స్వలాభం కోసం క్షమించమనివేడుకుంటారు.
తప్పును తెలుసుకున్నట్లు నటిస్తూ అదే తప్పు మళ్ళీ మళ్ళీ
చేస్తూ, దొరికిపోయిన ప్రతిసారీ క్షమాపణ అడుగుతారు.
మరి ఇంతకీ ఎవరిని క్షమించాలి?
క్షమించడానికి అర్హత ఉన్న వాళ్ళని క్షమించాలి.
మంచి మనసుతో క్షమించమని అడిగిన వారిని క్షమించాలి
చేసిన తప్పును తెలుసుకొని, ఆ తప్పు మళ్ళీ జీవితంలో చేసుకుండా వుండే వాళ్ళను క్షమించాలి.
నమ్మకద్రోహం చేసిన వారిని ఎప్పటికి క్షమించరాదు
అర్హత లేని వాళ్ళని క్షమిస్తూపోతే మనం వాళ్ళతో జీవిత కాలం బాధ పడుతాము
అందుకే ఎవరిని ఎంతవరకు క్షమించాలో అంత వరకే క్షమించాలి
క్షమించకూడని తప్పును కూడా క్షమిస్తే క్షమాపణ అనే పదానికి అర్థమే ఉండదు.



-అనిత దావత్
9394221927

## నా పల్లె తల్లి

రెక్కలొచ్చిన పక్షి గూడు వదిలీనట్టు
పట్న బాబులైన పల్లె 'బిడ్డా లిపుడు
పల్లె బాటా పట్టె నే 'తల్లి ఒడి చేరవస్తూ ఉన్నరే

వాడిపోయా నట్టి ఈ పల్లె బతుకు
కన్నీరు కార్చిన మన పల్లెటూరు
ఆశలూ చచ్చినా ముసలి కండ్లల్లో
ఆశలా కిరణాలు మళ్ళీ నింపాలని
పల్లె బాట పట్టె నే బాబులూ తల్లి దరికీ చేరేనే

పట్న సింగారాలు పూసుకున్నోళ్లు
సోకు నజరానా లు సుట్టుకున్నోళ్లు
పట్నాన్ని పున్నమి గా మార్చేసే టందుకు
పల్లెనూ అమాస చేసి వెల్లినోళ్లు
మూటా ముల్లెలతో పిల్లా పాపలతో
పట్నాన్ని వీడేసి పల్లె బాటా నడిచి
తల్లి ఒడిలో వాలెనే, పక్షి సొంత గూడూ చేరె నే

ఉపాధి లేని తల్లి నీడను వదిలి
భారమైన బతుకు సాగించలేక
బతుకు జీవుడ అంటు వలస పోయినోళ్లు
బంధాలను కంటి దుఃఖం లొ దాచుకుని
ముసల్లోళ్లను వాళ్ళ పానాన వదిలేసి
పొట్టకొసమై తల్లి ఒడిని వీడీనోళ్లు
తల్లి పిలిచిందని యాదికొచ్చిందనీ
పల్లె ఒడి లో వాలెనే , పక్షి సొంత గూటికి చేరెనే
కొత్త రోగాలన్ని బతుకుల్ని ప్రశ్నిస్తే
ఉపాధులను మింగేసి పొట్టనిండా కుండ
బతుకు గడవాకుండా కష్టాలు ఎదురొచ్చి
కన్నీళ్లు తెప్పిచ్చి క్షణ క్షణమూ
భయపడుతు ఊపిరాడా లేక
పానాలు అరచేత పట్టుకుని నేడు
తల్లి పిలిచిందనీ యాదికొచ్చిందనీ
పల్లె ఒడిలో వాలెనే పక్షి సొంత గూడూ చేరెనే

తల్లి మనసూ నేడు తల్లడిల్లింది
బిడ్డ కష్టానికీ కన్నీరు కార్చింది
ధైర్యమిచ్చి పల్లె ఆహ్వానమయ్యింది
దుఖ్ఖమ్ తొ బిడ్డలు తల్లినీ చేరి
జ్ఞాపకాలతో రక్త కన్నీరు కార్చిరీ

బిడ్డలను తన ఒడి లొ లాలించినా పల్లె
ఆలోచనయ్యింది మళ్లి దిగులయ్యింది
హాయిగా నిదురోయే నా బిడ్డలంతా
కన్నీళ్ల ను మళ్ళి అప్పగించేసి
బాధలా బతుకు ను కానుకగా ఇచ్చేసి
ఒడిని వీడి మళ్లి వెళ్లి పోతారేమోనని
దక్షమవుతున్నది పల్లె తల్లి దిగులుతో
మళ్ళి వణికి పోతున్నది తల్లి ఒడి



-సిరిసిల్లా గఫుర్ శిక్షక్
9849062038

## వాన పడితే బాగుండు

ఇప్పటి వరకు వర్షం పడితే
సర్కారు బడికే సెలవనుకొన్నా
వాన కురిస్తే సర్కారు బిల్డింగులన్నీ
జల్లెడ కింద నిలబడ్డ షవర్ బాత్ లే
పాకురు పట్టిన పచ్చని గోడలు
ఫంగస్ మొలచి ఊసిన కిటికీ ఊచలు
డ్రైనేజీలో పారే మురికి నీరు
నేరుగా ఆఫీసు రూంలోకే వస్తుంది
కాంట్రాక్టర్ స్వంత ఇల్లు గట్టిగ ఉంటుంది
వాడు కట్టిన బిల్డింగు పెచ్చులూడుతుంది
ఎండ వానలకు ఛత్రి పట్టిన మీకు
నడి ఇంటిలోపల గొడుగు పట్టిన అనుభవముందా?
దస్త్రాలు వరుకు సంచుల్లో కట్టలు కట్టి
తడవకుండా ఉండాలని తపన పడే ఆఫీసర్లు
బీదవాడు ఉరవద్దని ఇంటికి అరుకు కప్పితే
మా సర్కారు ఆర్ సీ సీ బిల్డింగులేమో
ఉరుపు రావద్దని అరుకులు కప్పుకొని
ముస్తాబవుతున్నాయి ముదితల్లాగా
అక్కడక్కడ పాత కాలపు ఆఫీసు బిల్డింగులు
మదమెక్కిన ఏనుగులా నిలబడి ఉన్నాయి
ఆ ప్రక్కనే నిరుడు కట్టిన ఆకాశ సౌధాలు
తనువెల్లా నీరు కారి తడిసిపోతుంటాయి
పాత కాలపు సాక్ష్యాలు అసలే ఉండొద్దని
పని గట్టుకొని కూలగొడుతున్నారు పాలకులు
అయినా ఎవరిని అడగగలను నేనూ ?
నాకు చిన్ననాటి నుండి ఉరిసే బిల్డింగులో
తట్టు వేసికొని చదివిన అనుభవముంది
ఆకాశంలో మబ్బును చూసిన మా సారు
ఇంటికి పంపిన మధుర స్మృతులున్నాయి
అందుకే నాలాంటి పిల్లల మదిలో మెదులుతుంది
వాన కొడితే
బాగుండనే ఓ కొంటె కోరిక.



- రత్న లక్ష్మి నారాయణ రెడ్డి
9951883145

## మన్నింపు గీతం

మధ్యాహ్న బడలికతో మేఘాలు
ప్రయాణాన్ని వాయిదా వేసుకుని
తథాగతుని బోధలు వినడానికి
సిద్ధమయినట్టున్నాయి
నిర్మలమైన ఆకాశంలా
మనసు నిర్మలంగా ఉండి
ఎంతకాలమయింది
అశాంతి మడుగులో బుద్ధుడొక్కడే
నిశ్చల స్వరూపుడు

అపనమ్మకాలన్నీ కలిసికట్టుగా వలేసి మరీ అనుమానపు
పొడసూపుల ఊబిలో కుదేస్తుంటే
నమ్మకం ఎక్కడో జారిపోయింది
జరుగుబాటే సమస్యయిన కాలంలో
తిరుగుబాటుకు చోటెక్కడ
నిశ్చింతల నెత్తావికి దారెక్కడ
కుదురుకోల్పోయిన ప్రపంచానికి
నిట్టూర్పుల ఓదార్పుతో మేఘాల
ప్రయాణం మొదలయింది
మకరందంలా తథాగతుని
మౌనభాష్యం ఊరిస్తూనే ఉంటుంది

-సి.యస్.రాంబాబు
8374818961

**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని 5 సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు. లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660 Gandhi Nagar Branch Hyderabad-80 అకౌంట్‌లో వేయవచ్చును.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి-74, జవహర్‌నగర్,
హైదరాబాద్-500 020.

## కరోనపై మణిపూసలు

శ్రీకరమని తలువకున్న
జగతిని కుదిపేసెరన్న
మహమ్మారి కరోనొచ్చి
గుణపాఠం నేర్పెనన్న !

కరోన ఒక వైరసంట
ప్రతి దేశపు శత్రువంట
భూగోళానికి తాళము
వేయించిన రోగమంట !

ప్రకృతి యొక్క కోపమా
మానవులది పాపమా
కరోన యను నెపముతో
దేవుల్లది శాపమా !

భూరాజును మించిపోయె
దినరాజును మించిపోయె
లోకాన కరోన భయము
యమరాజును మించిపోయె !

జంజముకై వచ్చింది
జగతిని వణికించింది
చైనా దేశపు కరోన
జనులను కబళించింది !

ఆశలు తగ్గించింది
ఆస్తిని తగ్గించింది
కనిపించని కరోన ఇల
అలజడి తగ్గించింది !

ప్రజలను భయపెట్టింది
ప్రగతి రథమునాపింది
ప్రపంచ శత్రువు కరోన
పరేషాను చేసింది !

కలుషితాలు కారణమే
కంపు బుద్ధి కారణమే
కరోన వైరసుకు మన
కర్మగూడ కారణమే !

దేహాలకు తప్పలేదు
దేశాలకు తప్పలేదు
కరోనతో లాక్‌డౌన్
దేవుళ్ళకు తప్పలేదు !

బడులన్నీ మూతవడెను
మదులన్నీ మూతవడెను
కరోనపై కదనానికి
గుడులన్నీ మూతవడెను !

వృక్తులను పట్టుకుంది
భక్తులను చుట్టుకుంది
కరోన తన కడుపులోన
శక్తులను పెట్టుకుంది !

ఘోరమాయె వలస బతుకు
నేరమాయె కూలి బతుకు
లాక్‌డౌన్ కాలములో
కష్టమాయె జనుల బతుకు !

దేశానికి కష్టాలు
లెక్కలేని నష్టాలు
మాయదారి కరోనతో
మారిపోయె నిష్టాలు !

కఠిన కాలమొచ్చెను
కతలవెతల దెచ్చెను
కరోన కోవిడ్ మనల
కలువకుండ జేసెను !

ఒకరి నొకరు ముట్టకుండ
ఒకరి నొకరు చూడకుండ
చచ్చె కాలమొచ్చె నేడు
ఒకరి నొకరు గలవకుండ !

విడివిడిగా ఉండాలి
నియమంగా బతుకాలి
కరోన రక్కసికి మనం
దూరంగా నిలువాలి !

శుభ్రత పాటించాలి
మన శక్తిని పెంచాలి
కరోనను నివారించ
మాస్కులు ధరియించాలి !

చేయి చేయి కలుపవద్దు
కౌగిలింత కోరవద్దు
విషపు గాలి కరోనకు
అవకాశం ఇవ్వవద్దు !

జనుల మధ్య తిరుగవద్దు
జాగ్రత్తలు మరువవద్దు
జలగలాంటి కరోనకు
జయమును చేకూర్చవద్దు !

ధనం గూడ వ్యర్థమే
గుణం గూడ వ్యర్థమే
కరోన వైరస్ ముందు
రణం గూడ వ్యర్థమే !

తిరుగుడు తగ్గించాలి
హద్దులు పాటించాలి
కరోన కనుమరుగవుటకు
యెల్లరు యోచించాలి !

ఒకరి కొకరు తాకకుండ
గుంపులుగా చేరకుండ
మనముంటే కరోన ఇక
ఉంటుందా వెళ్లకుండ ?!

సకల జనుల కాపాడగ
కరోననిక ఎదిరించగ
పోరాడిన వారికెల్ల
వందనాలు సమర్పణగ !

కరోనపై యుద్ధానికి
ప్రాణ రక్ష లక్ష్యానికి
వెనుకాడని దేవుళ్లకు
కృతజ్ఞతలు కష్టానికి !



-వడిచర్ల సత్యం
సెల్: 7989511543

## కరోనెందుకొచ్చిందో తెలుసా

ఎందుకొచ్చిందో మీకు తెలుసా
కరోనాను
ఎవరు పంపింద్రో మీకు తెలుసా

మానవత్వం మంటగలిసి
దానవత్వం పెరిగిపోయి
లోకమంతా అంధకారం
అలుముకున్న తీరుజూసి

ప్రకృతి కన్నెర్ర జేసి తెలుసా
కరోనాను భూమిపైకి
పంపినాది తెలుసా ।ప్రకృతి।

కప్పలను పాములను
బొద్దింకలు గబ్బిలాలను
అన్నిజీవుల జంపుకుంటు
వికృతాలు జేస్తువుంటే ।ప్రకృతి।

చెట్లను నరికేసినారు
ఎడారులుగా మార్చినారు
పర్యావరణమ్మునంతా
కలుషితమ్ము జేస్తుంటే ।ప్రకృతి।

దొంగతనములు దోపిడీలతొ
జనులను దోచేసుకుంటు
రోజురోజుకు తోటిమనుషుల
సంపుకుంటు బోతుంటే ।ప్రకృతి।

వావివరుసలు మరిచిపోయి
కన్నుమిన్ను గానకుండా
కండకావరమెక్కువయ్యి
స్త్రీలను వేధిస్తువుంటే ।ప్రకృతి।

మతముపిచ్చి పెరిగిపోయి
దారుణాలు చేసుకుంటూ
విషపుకోరలు జాచుకుంటు
విధ్వంసం చేస్తుంటే ।ప్రకృతి।

ఇప్పటికి మించింది లేదు
మనిషిగా జీవించుదాము
మానవత్వం పెంచుదాము
దానవత్వం తెంచుదాము
ప్రకృతిని పూజించుదాము అందరం
కరోనాను తరిమివేద్దామందరం

మహమ్మారి కరోనాకు
మందులేదు మాకు లేదు
అందరం ఇంట్లోనె వుండి
ఆనందం పొందుదాము
ప్రకృతిని పూజించుదాము అందరం
కరోనాను తరిమివేద్దామందరం

దేశమును ప్రేమించుదాము
ధర్మమును పాటించుదాము

ఆరోగ్యభారతాన్ని
చక్కగా నిర్మించుదాము
ప్రకృతిని పూజించుదాము అందరం
కరోనాను తరిమివేద్దామందరం

ఎందుకొచ్చిందో మీకు తెలుసా
కరోనాను
ఎవరు పంపింద్రో మీకు తెలుసా

ప్రకృతి కన్నెర్ర జేసి తెలుసా
కరోనాను భూమిపైకి
పంపినాది తెలుసా

అందుకే....
దేశమును ప్రేమించుదాము అందరం
ధర్మమును పాటించుదాము అందరం
ప్రకృతిని పూజించుదాము అందరం
కరోనాను తరిమివేద్దామందరం
కరోనాను తరిమివేద్దామందరం



-బండిరాజుల శంకర్
9948050608

## చౌకవనరు వలసకూలి

భూతల గగనంలో
రాజసం ఉట్టిపడుతూ
చరిత్ర వైభవంతో కౌశలాన్ని వెదజల్లుతూ
దేశాలకు గౌరవ తిలకమద్దుతున్న
మహా మహా రాజసౌధాలు
అద్భుత ప్రణాళికా ప్రాజెక్టుల కట్టడంకు
నడుముకట్టు కూలీలు వలసకూలీలుత

కన్నవారి కష్టాలు తీర్చగా
పొట్టపోసు కొనగా
ఆత్మీయ ఆలంబనకు దూరమై
గూడులేని వలస పక్షుల్లా బహుదూరము
పయనమౌతున్న వలస కూలీలు
కఠోరశ్రమల్లో హింసాత్మక విధుల్లో

ఆవేదన హృదయంతో
రోదన గతుకుల్లో
బతుకులీడ్చుతున్న వలస కూలీలు
స్థానగౌరవబలం దూరమై
తమపై నమ్మకం కరువై
దొరకని వనితో ఆకలి క్రోధంతో
హింసకు చేరువై
హత్య అరాచకాలు కావించు ఉద్రేకమై
సుడిగాలిలోన దీపంలా కడవరకు చేరకా
కటకటాల సంకెళ్ళతో
సనుగుతున్న వలస కూలీలు
కార్మిక కర్షక
ఆహార ఆరోగ్య అనేకవ్యవస్థల్లో
చౌకవనరు వలసకూలీకే ప్రథమ స్థానంలు.

వలసకూలీని విస్మరించిన
అధిక భారం మోయలేక
అవిటిదగును దేశాభివృద్ధి
సర్కారు స్పందించి తక్షణమే-
అభయమిస్తూ ఆదరించాలి
చౌకవనరు వలసకూలీని
ప్రాంతభేదాలు త్యజించూ
అలికిడి చేయని పిడికిలితత్వం పోషించు
వలసకూలీని స్వాగతించు
మానవ అభ్యుదయమునకు శ్వాసనొసుగు

-కందూరి సుజాతారాణి
9392162822??

## కరోనా బూచివచ్చె!

తేటగీతి: ఏమిటీ కరోనా క్రిమి యెక్కడిది
జిత్తులాడి చైనాలోన జీవమెత్తి
చిన్నిపురుగు జగమునేలు చున్న దకట!
నేడు ప్రాణాల చెలగాట మాడుచుండె!

ప్రకృతి పరిసరాలను మరీ పాడుజేసి
నట్టి నరులకు తెలివికి హద్దులేదు
లేదనుచు విర్రవీగడి శోభకులకు
బుద్ధి వచ్చెడి రీతిగ బూచివచ్చె

నేడు పాపము పండెనో పాడు పనుల
ఫలితమున కరోనా పుట్టి వచ్చెనేమొ!
మానవున హమును గూల్చగ మాధవుండె
పూని జేసెనేమొ! తెలియ బోదు నిజము?

వేద శాస్త్రాల సంస్కృతి విరియురీతి
భారతీయుల వైద్యము వరలురీతి
మాయదారి కరోనాను మట్టుబెట్టు
మందు కనిబెట్ట గలమోయి బొందబోట్ట

అంతవరకు యింట నిలువు ఆటలొద్దు
ముసుగు తొడిగి బలటకురా, పూని వినుము
ప్రభుత జెప్పిన మాటలు భాగ్యమనుచు
బ్రతికియున్నను తినవచ్చు బలుసు ఆకు.

- రాఘవ మాస్టారు
సెల్: 08660931280

## ఎవ్వరిప్రాణం.. వారేనిల్పుకుందాం... !

కరోనా కాల మిదియే
భరోస లేని బ్రతుకుయే
ప్రాణమెంతొ విలువైనది
జాగ్రత్త మన వంతుయే!

మేడలెన్ని వున్న గాని
బంగారెంతున్న గాని
పొలము పుత్ర వెంటరాదు
ధైర్యమెవుండాలి జ్ఞాని!

బంధు మిత్రు లెందరున్న
విందు చిందులెన్ని వున్న
కరోనా అంటుకుంటే...
జీవితమిక నిండు సున్న..!

నీ చేతుల నీ ప్రాణము
నిల్పుకునెడీ వైనము
కాలు కదపకుండ వుంటె
కలదు హాయిలె జీవనము!

కరోనా బారిన పడకు
వయసుందని మిడిసిపడకు
కుక్కలు పీక్కు తినె శవమై
ప్రాణాలను పణ్ణము పెట్టకు!

శుభ్రతే మన సౌభాగ్యము
కాపాడులె ఆరోగ్యము
విలువైన మనప్రాణాలు
నిల్పుకుంటె శుభ యోగము!

దాటరాదు మనదు హద్దు
వెంటరారు చూడ కద్దు
కష్టాలలో ధీరత తో
ప్రాణాలిక నిల్పు ముద్దు!!!



-డాక్టర్ గన్నోజుశ్రీనివాసాచారి
8555899493

## తలుపులు మూసే ఉంచాలిప్పుడు...!

కనురెప్పలచాటున దాగిన బాదలన్ని
కన్నీటి రూపంలో కరిగిపోతున్నాయి.
కంటికి నిదుర కరువై,
రాతిరంత ఎదలో రగిలిన బాధ
కురిసిన వానలా మారి,
తడి ఆరని బురదమట్టిలో
ఇంకిపోయే జీవితం.
ప్రళయంలా దూసుకొస్తున్న మహమ్మారి
గొంతుపెకలని రాగమై వినిపిస్తూ
విశ్వమంతా చిమ్మచీకట్లను కమ్ముతుంది.
ఇప్పుడు ఈ ప్రపంచపు తలుపులు మూసే ఉంచాలి.
గాలిలో కలిసిపోయిన విషపు పురుగు,
పుడమి అంతా పరుచుకొని,
రివ్వున దూసుకొచ్చే రాయి లా మారి,
నిలకడగా ఉన్న నిరులాంటి బతుకులో

అలజడి సృష్టిస్తోంది.
నువ్వు నేను మనందరం అప్రమత్తతలేకే కదా...!
ఈ గాజులాంటి దేహం ముక్కలైపోతుంది.
ప్రపంచానికి ముచ్చెమటలు పట్టిస్తోంది.
నీటి బుడగలాంటి ఈ జీవితానికి కొరికలెన్నో.
కసాయి మనిషి కనికరం కరువాయే.
ఇప్పుడు ఆపన్న హస్తం అందించడానికి కొన్ని
చేతులు కావాలి.
ఆరిపోతున్న దీపాలకు అర చేతులు అడ్డుపెట్టి
రక్షణగా నిలబడాలిప్పుడు.



-అశోక్ గోనె
9441317361

## మోహ తిమిరం

దేహం శిథిలమైనా
చెదరనిది హరిత స్వప్నం
కాలం కఠినమైనా
చెరగనిది విశ్వాస కిరణం

వ్యాపార నీతుల
గొడ్డలి వేటుకు
విలవిలలాడినా
గోరంత మిగిలిన చిగురు
అంబరమంత ఆనందమిచ్చును
అదే కదా సృష్టి చైతన్యం

మరి మనిషిలో లేదెందుకు చలనం
మనసులోని మౌన దీప్తిని వదిలి

అంతరంగం లోని ఆత్మ శాంతిని వీడి
భోగ లాలసతో
ఏ తీరాలకు పయనం?
శిశిర దేహంపై ఎందుకు వ్యామోహం

పచ్చని ప్రకృతి కాంతిని హరించి
వన సీమలనాక్రమించి
మృగతృష్ణతో చరించి
సాధించిందేమిటి?

కరోనా కరాళ నృత్యంతో నైనా
తెరుచుకోవాలి జ్ఞాన నయనం
తొలగి పోవాలి అవాంఛిత
అజ్ఞాన మోహ తిమిరం



-వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

## ప్రాణ త్యాగాలు

మట్టితో వియ్యమంది
నాగటి సాల్లల్లో పొదిగి
జలాక్షింతలకు తడిసి
అంకురం కోసం బద్దలైన
విత్తనాదెంత త్యాగమో కదా !

దేవుని పూజలకు
తనో వారధిగా నిలిచి
బండతో ఢీకొని బద్దలై
పగిలి ప్రసాదమైన టెంకాయ
ప్రాణత్యాగానికి వెల ఎంతో కదా !

నిత్యం కత్తి కోతను ఓర్చుకుంటూ
నింగిని తాకేలా నిలబడి
బాధను ఓర్చుకుంటూ దిగమింగి
కన్నీళ్లనే తెల్ల కల్లుగా కార్చే
తాడిచెట్టు త్యాగం అపురూపమే కదా !

అణువణువూ అరిగి తరిగినా
నేల రాపిడినోడ్చి, రాళ్ళురప్పల్ని ఢీకొంటూ
అవిశ్రాంతంగా గిరగిర తిరుగుతూ
మనల్ని గమ్యస్థానాలకు చేర్చే
టైరుదెంత తృప్తో త్యాగమో కదా !

యజమాని పాదాల సాక్షిగా
ఆభరణమైనాని మురిసి
ముళ్ళు రాళ్ళను భరించి
తనువంతా సుస్కించినా
గర్వంగా నవ్వే చెప్పుదెంత త్యాగమో కదా !
సముద్రమే ఆలవాలంగా
అపూర్వంగా ఆడుతూ ఎదిగి
తనువు చాలిస్తానని తెలిసీ
ముదిపెంగా ముత్యాలకు జన్మనిచ్చే
ఆలుచిప్ప బతుకుకెంత ధన్యమే కదా !

వెల పిసరంతైన అక్షరశిల్పిగా
హస్తంలో ఉలిగా, కాగితంపై నర్తిస్తూ
భావాలు, బొమ్మలకు ప్రాణం పోస్తూ
బ్లేడుతో కంఠాన్ని కోసినా నవ్వుతూ భరించే
పెన్సిల్‌దెంత నిస్వార్థ త్యాగమో కదా !

పాదాల కింద నలిగి చక్రంపై ఒదిగి కూర్చొని
నరచేతులలో నవ్వుతూ ఆకృతి దాల్చి
బట్టీల మంటల్లో కాలి దహనమైనా

గొంతును శీతలనీటితో తడుప తపించే
మట్టి కుండ త్యాగం అసామాన్యమే కదా !

మొక్కై చెట్టై నవ్వుతూ ఎదిగి
చెట్టు నుండి ఆకును వేరుచేసి
పిప్పిపిప్పిగా రోట్లో వేసి నలిపినా
స్త్రీ మృదుహస్తంలో సింగిడిగా పూస్తాని
అన్నీ సహించే
గోరింటాకుది గొప్ప త్యాగమే కదా !

సామాన్యుడుగా పరులకై జీవించి
తన ఆకలి అరుపులను మరిచి
పేదల పేగులను పరామర్శించి
బుక్కెడ బువ్వను వడ్డించే
మహామనిషి త్యాగం ఆదర్శమే కదా !



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## మట్టి గీతం

యుద్ధం అంటే
నీకో,నాకో కాదు
నేలకూ నాగలికి
భూమిలో నాల్గు విత్తులు
వేసాకే మొదలవుతుంది
మేఘాల మొరాయింపులు
గాలి గారడీలు
ఋతుపవనాల ఫిరాయింపులూ
నకిలీ విత్తనాల
పక పకలూ...
పనిచెయ్యని క్రిమి సంహారక మందులూ

పాలిపోయి వాడిన కంకులూ
ఎదురొచ్చే శత్రువైతే ఎదిరించొచ్చు
నమ్మకపు లేబిల్ తో
నడ్డివిరిచే వాళ్ళతో
యుద్ధం కష్టమే
శ్రమని చిందించాక
నాలుగు ముద్దలు

నోట్లోకి పోతేనే కదా
యుద్ధానికి సార్థకత
మేఘం మురిసి కురిసాక
కొన్ని ఆశలు తీరి మురియాలి
కన్నీటిని పులుము కొన్న కళ్ళు
సేదతీరి ఆనందంతో వెల్లి విరియాలి

మాగాణి యుద్ధం ముగిశాక
మనో నేత్రాలపై కలలు
ఆశల పిట్టై వాలి
మట్టి గీతం ఆలపించాలి



-మహబూబ్ భాషా చిల్లెం
9502000415

## నేను కవితలై జీవిస్తాను

నేను కవితలై జీవిస్తాను
కవితల్లోనే మరణిస్తాను
అక్షరాలను సమకూర్చి
మాలలు మాలలుగా అల్లుకుంటాను
కొన్ని మనసులని హత్తుకుంటాను
ఉదయాన్నే వికసించిన పుష్పంలా
నా మదిలో వికసించి
నా హృదయాన్ని కదిలించి
నాతోనే జీవిస్తున్న అక్షరానికి నేనేస్తాన్ని

సాగుతున్నాను
ఇదే నా జీవితం
ఇదే నా వ్యక్తిత్వం
నిన్నంటే జ్ఞాపకం!
నేడంటే వాస్తవం!

రేపంటే స్వప్నం!
ఇంతేగా ఈ జీవితం
అందుకే చావులేని అక్షరాలతో బతుకుదామని
బతుకుతున్నాను
కలంలో

హృదయభావాన్ని నింపితే
జాలువారే ప్రతి అక్షరం
కూడా అద్భుతమే
ఓ ప్రస్థానమే



-కల్లెం నవీన్ రెడ్డి
9963691692

## మానవ వృక్షం

తెలంగాణ మాగాణమే హరితహారం
పచ్చని కాంతుల పరిమళ తోరణం
మొక్కలునాటే దీక్షా దక్షతలయాగం
నలుకోట్ల కుక్షిబాధలు తీర్చే 'మా'నవయత్నం
నేల ఈనినట్లు పచ్చనిచెట్ల పైరగాలుల
సంక్షేమ సత్వాల సంకల్ప యజ్ఞం
సకాల వర్షాలు కాలుష్యనివారణం
సస్యశ్యామలం
పులకించాలి పచ్చదనాల కోమలం..!

చెలిమికి ఆటపట్టు
మానవజాతికి ఆయువుపట్టు ఆప్యాయతల అసలుగుట్టు
భూతల్లికి పెద్దబిడ్డ సీతమ్మే చిన్నబిడ్డ
ఆకాంక్షల వరదాయి
అవనికే అనురాగ సిరులిచ్చే

ఆత్మీయ సుఖదాయి...!

అశ్వత్థ వృక్షంగ-మైథిలీనోదార్చి
బోధి వృక్షమై తథాగతునికి మోక్షమిచ్చి
తనువునుతరిగినా కొమ్మల్నికొట్టినా..!
గంధపరిమళాల్ని అనుబంధంగ
హాయిగా చల్లగా పంచుతూ
జమ్మిచెట్టు పండుగలో బంగారమై
మనుషులతో వెన్నంటి నడుస్తూ
వేళ్ళనే ఔషధంగా పంచే
సర్వజీవుల శ్వాసకాధారమైన పరమాత్ముని బిడ్డ..!

బుద్ధిబంగారంగా నుదుటి సింగారంగా

నిలువెల్ల అనురాగంగ
తలపంతా సమభావంగ...
కొబ్బరికాయల్లొ కొంగుబంగారమై..!
కొత్తశక్తినింపి కోర్కెల్ని దీరుస్తూ
కాలచక్ర గతిలో కళలెన్నొచేకూర్చి
ప్రగతిమార్గాన్నిచూపే
పంచశక్తులు ప్రణవ స్వరూపిణి....!
మొక్కల్నిపెంచుదాం..!
మోదాన్నికూర్చుదాం...!!



-డా.పాండాల మహేశ్వర్
9912180054.7891837830

## నువ్వు నేను

బీజం నువ్వు
సుక్షేత్రం నేను!

ప్రచండం నువ్వు,
ప్రకృతి నేను!

జ్ఞాననిధి నువ్వు,
అనుభవాల గని నేను!!

స్వప్రకాశం నువ్వు,
సుప్రబోధం నేను!!

సౌజన్యం నువ్వు,
సౌశీల్యం నేను!

విజ్ఞానం నువ్వు,
నీ విజయం నేను!

మాట నువ్వు
మనసు నేను!!

అలుపెరుగని పయనం నీది,
అలసట చూపని గమనం నాది!

ఎగిరే గువ్వల స్వేచ్ఛ నీ తత్త్వం!
కరిమబ్బులా కురిసి
ఫలించడం నా నైజం!

నీ కరము నా మనికికి,
నా చెలిమి నీ ఉనికికీ ,
ఆధారం!!!

ఎవరేమన్నా...
అంతటా....

భూమి నైనా...
ఆకాశంలోనైనా...
మనం సములం!

మనమైతేనే సంతులత,
ఘనత!!
నువ్వో సగం!నేనో సగం!!
వెరసి...
అర్థనారీశ్వరం!!!!



-సుభాషిణి ప్రత్తిపాటి
8099305303

## ఓ అలజడి

ఓ మెత్తనిఅలజడి
వడివడిగా గుండె లోతులను
తట్టి తట్టి తడిమి తడిమి
మరీ మరీ స్పృశిస్తోంది

కాలం వెల్లువలో
వసంతాల రెప్పల మాటున
విచ్చుకొని వెదజల్లే
వయసు మల్లెల పరిమళాలు..
గ్రీష్మ తాపాలకు సొమ్మసిల్లి
తల్లడిల్లిన.. తనూలతల
సోయగాలను సవరిస్తూ సరి చేస్తూ

చిరుజల్లుల జడివానల లో
తడిసిన అనుభవాలన
శరత్ రాత్రుల అందాలలో
ప్రోదిచేసు కొన్న క్షణాలు ..
మరీ మరీ మనసును మరింత దగ్గరగా
హేమంత కుసుమ పరిష్వంగంలో
అక్కున చేర్చుకొని పరవశించి
పదనర్తనలు చేస్తున్న కణాలు ..

ఒక్కొక్కటి గా రాలిపోతూ క్షణాలు ..
చేతనంలోంచి అచేతనంలోకి
అలవోకగా కదలి
కలిసిపోతున్న ఎన్నో కాలాలకు
సాక్ష్యాలు చెబుతూ....
మరొక్కమారు మరొక్కమారు అంటూ
ప్రశ్నిస్తోంది.....
ఇలా

ఈ మమతల లోగిళ్ళలో మరోముగ్గు
వేయడమేనా అంటూ



-లలితా భాస్కర దేవ్
9885552922

## ఏమిటీ...?

ఏమిటీ ఈ నల్ల వసంతం ?
కోయిలలు కమ్మగా కూయాల్సిన చోట
నిశ్శబ్ద శ్మశానపు వైరాగ్యమృత్యుకుహరం

ఏమిటీ ఈ ఒంటరి జీవితం ?
బతుకు వసంతంలా చిగురించాల్సిన చోట
గ్రీష్మఋతువులా ఉక్కిరిబిక్కిరి హిందోళరాగం

ఏమిటీ ఈ దుఃఖసముద్రం ?
గలగలలా సాగిపోవాల్సిన మానవ జీవితం
మౌనగీతమై సాగిపోతున్న ఒంటరిపోరాటం

ఏమిటీ ఈ ఎడతెరపిలేని దుఃఖం ?
గేయాలు సుమాలై పరిమళించాల్సిన చోట
లేడిగాయాల వేడినిట్టూర్పుల నిర్నిద్రగానం

ఏమిటీ ఈ హృదయవిలాపం ?
అనుబంధాలు పల్లవిలా వికసించాల్సిన చోట
అశ్రునివాళుల్లా మహాప్రళయపు కన్నీటిగీతం

ఏమిటీ ఈ బలిపీఠం ?
బతుకు బంగారం కావాల్సిన చోట
జీవితాలన్నీ జీర్ణమవుతున్న వైనం

ఏమిటీ ఈ కలియుగ మాయారోగం ?
ఆశలన్నీ అతిశయం కావాల్సిన చోట
అతలాకుతలమైన తపోభంగపు శిథిలస్వప్నం

ఏమటీ ఈ కరువుగీతం ?
పచ్చగా ప్రకృతి కళకళలాడాల్సిన చోట
కరువుకాటకాల ఖననపు తుఫానుప్రతాపం

ఏమిటీ ఈ అపరాధభావం ?
ఆత్మీయులను పలకరించాల్సిన చోట
కబంధహస్తాల్లో చిక్కుకున్న పంజరజీవితం

ఏమిటీ ఈ అప్రకటితనిషేధం ?
భవిష్యత్తులోకి తొంగిచూడాల్సిన చోట
అడుగులన్నీ మడుగులోకి వెళ్ళిపోవడం

ఏమిటి ఈ మరణమృదంగం ?
జీవితాలన్నీ నిండుగా పుష్పించాల్సిన చోట
లోకమంతా శ్మశానదిబ్బల శోకసముద్రం



- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

చెయ్యగలిగుండీ చిన్న సాయం చెయ్యకపోతే
ఆ పిమ్మట భారీ ఖర్చుతో ఖాలీని పూరించి
తిరిగి బంధాన్ని నిలుపుకోజూస్తారు.
చిన్న మాటకే అలిగి దూరంగా పారిపోతే
ఆ తరవాత పొడుగాటి మాటల్లో పొగిడీ పొగిడీ
మళ్లీ సామీప్యాన్ని కోరుకోజూస్తారు.
ఎటుజేసి- చిన్న చిన్న పొరపాట్లకే
భారీ మూల్యం చెల్లించి వేస్తారు.

-మునిమడుగుల రాజారావు !

